ఈనాడు
అనంతపురం
శుక్రవారం అక్టోబరు 25, 2024



రెండేళ్లు.. ఒక్క కి.మీ తిరగలె

కొత్త అంబులెన్స్‌కు డ్రైవర్ లేరంట

ఎక్కడో మారుమూల ప్రాంతంలో అంబులెన్స్‌ను తిప్పకుండా ఒకేచోట ఉంచారంటే అధికారుల పర్యవేక్షణ కొరవడి అలా జరిగిందని అనుకోవచ్చు. జిల్లా కేంద్రంలో రోజూ అధికారి వచ్చిపోయే కార్యాలయం ముందే ఉన్న అంబులెన్స్‌ను రెండేళ్లుగా వృథాగా ఉంచారంటే డీసీహెచ్ఎస్ అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రెండేళ్ల క్రితం అనంతపురం డీసీహెచ్ఎస్ కార్యాలయానికి ఓ అంబులెన్స్‌ను కేటాయించారు. ఇది జిల్లా కేంద్రానికి వచ్చినప్పటి నుంచి డీసీహెచ్ఎస్ ప్రధాన కార్యాలయం ఎదుట నిలిపి ఉంచారు. ఇప్పటివరకు ఒక్క రోగిని అందులో తరలించలేదు. నిలిపిన చోట నుంచి కనీసం వాహనాన్ని పక్కకు పెట్టిన పాపాన పోలేదు. రోజూ డీసీహెచ్ఎస్ అధికారి ఈ వాహనం ముందు నుంచే కార్యాలయంలోకి వెళుతున్నా ఏనాడు పట్టించుకోలేదు. సర్వజన వైద్యశాల నుంచి సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రికి పలువురు రోగులను వైద్యులు రెఫర్ చేస్తుంటారు. అలాంటి వారిని తరలించేందుకు వినియోగించే అవకాశం ఉన్నా దృష్టి పెట్టలేదు. సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రిలో ఎంఆర్ఐ పరీక్ష అందుబాటులో లేకపోవటంతో వైద్యులు సర్వజన వైద్యశాలకు రోగులను పంపుతుంటారు. ఇలా రోజువారీగా 20కి పైగా కేసులు ఉంటాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారిని తరలించడానికి అంబులెన్స్‌ను వినియోగించినా ప్రజాధనానికి సార్థకత చేకూరేది. రూ.లక్షల విలువైన వాహనం నిరుపయోగంగా మారిన వైనంపై డీసీహెచ్ఎస్ అధికారి పాల్ రవికుమార్ దృష్టికి తీసుకెళ్లగా డ్రైవర్ లేక వినియోగించడం లేదని చెప్పటం గమనార్హం.

- న్యూస్‌టుడే, లక్ష్మీనగర్ (అనంతపురం)

కంటిచూపు తగ్గుతోంది!

ఉమ్మడి జిల్లాలో విద్యార్థులకు పరీక్షలు

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే

సర్వేంద్రియానం నయనం ప్రధానం.. జీవన గమనంలో నేత్ర ప్రాధాన్యం తెలియంది కాదు. వయసు మీద పడ్డాక సమస్యలు వస్తాయనుకుంటే పొరపాటే. ప్రస్తుత పరిస్థితుల్లో వయసుతో సంబంధం లేకుండా సమస్యలు తలెత్తుతున్నాయి. చిన్నారుల్లో దృష్టిలోపాలు అధికమవుతుండటంతో ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలోపం ఉన్న విద్యార్థులను గుర్తించి.. అద్దాలను ఉచితంగా అందజేయటం, అవసరమైన వారికి శస్త్రచికిత్స చేయించాలని నిర్ణయించింది. ఈమేరకు ఈ ఏడాది ఆగస్టు నుంచి 'స్కూల్ ఆఫ్ హెల్త్ ఐ స్క్రీనింగ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సమగ్రశిక్షా, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సమన్వయంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదోతరగతి చదువుతున్న విద్యార్థులను పరీక్షించాలని ఆదేశించింది. ఆప్తాల్మిక్ అసిస్టెంట్‌లు బృందాలుగా ఏర్పడి విద్యార్థులకు పరీక్షలు చేసి వివరాలను నివేదించాలని ఉత్తర్వులో పేర్కొంది. ఈనెల 31లోపు కార్యక్రమాన్ని పూర్తి చేయాలాని ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో ఆప్తాల్మిక్ అసిస్టెంట్‌లు 12 మంది, ఉద్యోగులు 14 మంది మాత్రమే ఉండటంతో గడువు లోపు లక్ష్యాన్ని పూర్తి చేయలేని పరిస్థితి నెలకొంది.

ఇరు జిల్లాల్లో ఇలా.. (● అనంతపురం ● శ్రీసత్యసాయి)

	అనంతపురం	శ్రీసత్యసాయి
స్క్రీనింగ్ చేయాల్సిన పాఠశాలలు	2,510	1,530
కంటి పరీక్షలు పూర్తయిన బడులు	254	494
చేయించుకున్న విద్యార్థులు	31,569	45,164
పరీక్ష చేయాల్సిన విద్యార్థుల సంఖ్య	2,65,946	1,35,206
ఎంతమందికి కళ్లద్దాలు ఇవ్వాలని లక్ష్యం	4,068	1,951
కళ్లద్దాలు అవసరమని గుర్తించిన విద్యార్థుల సంఖ్య	1,199	1,389

పెరిగిన సెల్‌ఫోన్ల వినియోగంతో అనర్థం

కొవిడ్ కాలంలో పాఠశాలలకు సెలవు ఇచ్చినా ఆన్‌లైన్‌లో తరగతులు కొనసాగాయి. ఇందుకు సెల్‌ఫోన్‌లు, ట్యాబ్‌లు అవసరం కావడంతో పిల్లల తల్లిదండ్రులు వాటిని సమకూర్చారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు వాటికి విపరీతంగా అలవాటుపడ్డారు. కొవిడ్ వ్యాప్తికి అడ్డుకట్టపడి.. బడులు ప్రారంభమైనప్పటికీ విద్యార్థులు మాత్రం సెల్‌ఫోన్, ట్యాబ్‌లను వీడని పరిస్థితి నెలకొంది. చాలా మంది ఎక్కువసేపు సెల్‌ఫోన్‌తో గడుపుతున్నారు. మరికొందరు కంప్యూటర్‌లో వివిధ రకాల ఆటలు ఆడుతున్నారు. కొంత మంది తల్లిదండ్రులు.. తమ చిన్నారులు ఆహారం తినాలన్నా, ఏడుపు ఆపాలన్నా సెల్‌ఫోన్ చూపిస్తుండటంతో దృష్టిలోపం వస్తోందని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువసేపు వాటిని వినియోగిస్తుండటంతో కంటి సమస్యలు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఎక్కువగా ఆకుకూరలతో కూడిన పౌష్టికాహారాన్ని అందించాలని, కంటి సమస్య గుర్తిస్తే వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించాలని అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల కంటి విభాగం హెచ్‌వోడీ డాక్టర్ వై.ఎం.ఎస్.ఎస్ ప్రసాద్ సూచించారు.



విద్యార్థినికి కంటి పరీక్ష నిర్వహిస్తున్న ఆప్తాల్మిక్ అసిస్టెంట్

అందరికీ పరీక్షలు నిర్వహిస్తాం

- సైదన్న, అనురాధ, మేనేజర్లు, అంధత్వనివారణ సంస్థ, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు

ఈ నెలలోపు ప్రభుత్వ విద్యాసంస్థల్లో అందరికీ కంటి పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. ఉద్యోగుల తక్కువగా ఉండటంతో పూర్తి స్థాయిలో చేయలేకపోతున్నాం. గడువు ముగిసినా కంటి పరీక్షల నిర్వహణ ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటి వరకు కళ్లద్దాలు అవసరమయ్యే వారిని గుర్తించాం. అద్దాలు రాగానే అందజేస్తాం. ఉపాధ్యాయుల సహకారంతో ఆప్తాల్మిక్ అసిస్టెంట్‌లు విద్యార్థులు అందరికీ పరీక్షలు నిర్వహిస్తారు.

పండమేరు ఆక్రమణలు తొలగిస్తాం



మాట్లాడుతున్న కలెక్టర్

- ప్రత్యేక అధికారులతో సర్వే చేస్తున్నాం
- కలెక్టర్ వినోద్‌కుమార్ వెల్లడి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర శివారులో ఉన్న పండమేరు వంక పరివాహక ప్రాంతానికి ఇరువైపుల ఉన్న ఆక్రమణలను తొలగిస్తామని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వెల్లడించారు. గురువారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మంగళవారం పండమేరు వంకకు ఆకస్మికంగా వరద పోటెత్తింది. దీనికి కర్ణాటక, శ్రీసత్యసాయి జిల్లాలో భారీ వర్షాలు పడటమేనన్నారు. ఒక్కసారిగా పండమేరు వంక ఉప్పొంగింది. ఆ వంక పరివాహక ప్రాంతాల్లో ఉన్న కాలనీలు నీట మునిగాయన్నారు. వంక పొరంబోకులో ఆక్రమణలు ఉన్నాయని, రెవెన్యూ, పౌర సరఫరాలు, సర్వే, మున్సిపల్ శాఖలు సంయుక్తంగా సర్వే చేస్తున్నాయన్నారు. వారం పది రోజుల్లో ఈ ప్రక్రియ ముగుస్తుందన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉండే ఆక్రమణలను తొలగిస్తామని, నివాసితులకు పీఎం ఆవాస్ యోజన కింద పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. ఆక్రమణదారులకు త్వరలోనే నోటీసులు కూడా జారీ చేస్తామన్నారు.

రూ.3.39 కోట్ల నష్టం

జిల్లాలో 17 మండలాల పరిధిలో 42 గ్రామాల్లో వర్షాల మూలంగా నష్టం వాటిల్లింది. 1675 మంది వర్షాల ఇబ్బంది పడ్డారు. వ్యవసాయం, ఉద్యాన పంటలు 525.12 హెక్టార్లల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఇందుకు రూ. 3.39 కోట్లు నష్టం వచ్చిందని ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. ఉద్యాన పంటలే 68.2 హెక్టార్లల్లో దెబ్బ తిన్నాయని, 40 కచ్చా ఇళ్లు పాడయ్యాయని, 525 గృహాల్లోకి వర్షపు నీరు చేరిందన్నారు. పండమేరు వరద బాధితులకు ఈ నెల 26న నష్ట పరిహారం అందిస్తామన్నారు. ఆధార్ లింకు బ్యాంకు ఖాతాలకు నిర్దేశిత మొత్తాన్ని జమ చేస్తామన్నారు. వ్యవసాయ, ఉద్యాన నష్టాన్ని పూర్తిగా అంచనా వేసేందుకు ప్రత్యేక బృందాలను నియమించామన్నారు. వంకలు, జలాశయాలు, ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలపై జేసీ సారథ్యంలో ప్రత్యేక సర్వే చేయిస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

69.60 లక్షల మొక్కలు పెంపకమే లక్ష్యం: డీఎఫ్‌వో

రాంనగర్ (అనంతపురం) న్యూస్‌టుడే : ఉమ్మడి అనంతపురం జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద 69.60 లక్షలు మొక్కలు పెంపకమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి అటవీశాఖ అధికారి జి.పి. ఆనంద పేర్కొన్నారు. గురువారం అనంతపురంలో ఉమ్మడి జిల్లా అటవీ, సామాజిక వన విభాగం, డ్వామా సంయుక్త ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారి సెల్వం హాజరు కావాల్సి ఉండగా అనివార్య కారణాలతో రాలేకపోయారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి డీఎఫ్‌వో జీపీ ఆనంద, సామాజిక వన విభాగం డీఎఫ్‌వో చంద్రశేఖర్ సారథ్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. వారు మాట్లాడుతూ..అనంతపురం జిల్లాలో సామాజిక వన విభాగం, అటవీశాఖకు సంబంధించి 13 నర్సరీల్లో 34.80 లక్షలు, శ్రీసత్యసాయి జిల్లాలో సామాజిక వన విభాగం, అటవీ శాఖకు సంబంధించి 18 నర్సరీల్లో 34.80 లక్షలు మొక్కలు పెంపకం చేపట్టనున్నామన్నారు. ఉపాధి హామీ నిధులతోనే మొక్కలు పెంచుతామని వారు వివరించారు. ఏడాదికి కూలీలకు 100 రోజులు పనిదినాలు ఉండగా ఇప్పటికీ ఏడు నెలలు గడిచిపోతోంది. కూలీల పనిదినాలకు కష్టమవుతోందని, చిన్న సంచుల్లో మొక్కలు పెంచుతామన్నారు. పెద్ద సంచుల్లో మార్చేందుకు నివేదికల అంచనాల్లో లేదని, పెద్ద సంచులు కొనుగోలుకు అనుమతులు ఇవ్వాలని, నర్సరీల్లో చాలాచోట్ల విద్యుత్, పైప్‌లైన్లు, నీటి వసతి వంటి సౌకర్యాల్లేవని, ఉపాధిహామీ నిధులు కేటాయించలేదన్నారు. మొక్కలు పెంచేందుకు సమస్యలున్నాయని రేంజ్ ఆఫీసర్లు డీఎఫ్‌వోల దృష్టికి తీసుకొచ్చారు. వీటన్నిటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

సమష్టి కృషితో కృష్ణాజాలాలు తీసుకొస్తాం

● రెండున్నరేళ్లలో ప్రాజెక్టు పనులు పూర్తి

గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే: రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల అభ్యున్నతికి భైరవానితిప్ప ప్రాజెక్టుకు సమష్టి కృషితో కృష్ణా జలాలను తీసుకొస్తామని ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. గురువారం కుడి, ఎడమ కాలువల్లో గంగపూజ చేసి నీటిని విడుదల చేశారు. వారం రోజులుగా కురిసిన భారీ వర్షానికి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరగటంతో గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. అత్యంత వెనుకబడిన ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలని గత తెదేపా పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.968 కోట్లను మంజూరు చేస్తే గత వైకాపా ప్రభుత్వం పనులను తుంగలో తొక్కి ఈ ప్రాంత ప్రజలకు ద్రోహం చేసిందని మండిపడ్డారు. ప్రస్తుతం మంచి రోజులొచ్చాయని, రెండ్రోజుల కిందట ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగిన కేబినెట్ సమావేశంలో హంద్రీనీవా కాలువ సామర్థ్యం పెంచేందుకు దాదాపుగా రూ.2 వేల కోట్లను మంజూరు చేశారన్నారు. తొలిదశ మల్యాల నుంచి జీడిపల్లి వరకు కాలువ సామర్థ్యం పెంచితే ఎక్కువ నీరు జీడిపల్లికి చేరుతాయని, దీంతో అక్కడి నుంచి కృష్ణాజలాలను బీటీ ప్రాజెక్టుకు తీసుకొచ్చేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. త్వరలోనే ముఖ్యమంత్రిని కలిసి ప్రాజెక్టు పనులను చేపట్టేలా విన్నవిస్తామన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకే రెండున్నరేళ్లలో ప్రాజెక్టుకు కృష్ణాజలాలు తీసుకొచ్చి కళ్యాణదుర్గం ప్రాంతంలోని 114 చెరువులు నింపుతామని ఎమ్మెల్యేలు వివరించారు. కార్యక్రమంలో నీటిపారుదల ఈఈ నారాయణస్వామి, ఏఈ సాయిరాం, జడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతి, సర్పంచి విజయలక్ష్మి, తెదేపా నాయకులు గిరిమల్లప్ప, హనుమంతు, హనుమంతరెడ్డి, శ్రీరాములు, కాలవ సన్నన్న, కేపీదొడ్డి నాగరాజు, దుర్గేష్, పైదొడ్డి రాజు, రామ్మోహన్ చౌదరి, నగేశ్ యాదవ్, తిప్పేస్వామి, రామరాజు, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



భైరవానితిప్ప ప్రాజెక్టులో గంగపూజ చేస్తున్న ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు తదితరులు

29, 30 తేదీల్లో ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడాపోటీలు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29, 30 తేదీల్లో ప్రభుత్వ ఉద్యోగుల జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీఓ ఎస్‌కే షఫీ తెలిపారు. 29న బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, యోగా, చెస్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్ పోటీలు ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తామని తెలిపారు. క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, అథ్లెటిక్స్, హాకీ వాలీబాల్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, శారీరక సౌష్టవ పోటీలు సంజీవరెడ్డి స్టేడియంలో జరుగుతాయని ఆయన వివరించారు. ఈ నెల 30న ఈత ప్రసన్నాయపల్లి ఈత కొలనులో, లాన్‌టెన్నిస్ పోటీలు నాదల్ అకాడమీలో నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ శాఖల మహిళా ఉద్యోగినులు, పురుషులు శాఖాధిపతుల ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 28 లోగా డీఎస్ఏలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

జిల్లా విద్యాశాఖాధికారిగా ప్రసాద్‌బాబు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా విద్యాశాఖాధికారిగా ప్రసాద్‌బాబు నియమితులయ్యారు. ప్రస్తుతం డీఈవోగా ఉన్న వరలక్ష్మి చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఏడీగా ఉన్న ఎం.ప్రసాద్‌బాబు అనంతపురం జిల్లా విద్యాశాఖాధికారిగా నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు.

వేరుసెనగ తడిసి.. కన్నీరు మిగిల్చి..



కనగానపల్లి మండలం మామిళ్లపల్లి వద్ద రహదారిపై ఆరబోసిన వేరుసెనగ కాయలు



ముక్కిపోయిన వేరుసెనగ కాయలను చూపుతున్న లింగంపల్లికి చెందిన రైతు వెంకట్‌రెడ్డి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వేరుసెనగ రైతు కుదేలయ్యాడు. పొలంలోనే వేరుసెనగ పాడైపోయింది. కొన్ని ప్రాంతాల్లో బయట కుప్పలుగా పోసిన కాయలు తడిసిపోయాయి. రైతులు ఆరబెట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నా కాయలు కుళ్లిపోయే పరిస్థితి ఉంది. గత రెండు రోజులు ఎండ బాగా వస్తున్నా రాత్రి వేళల్లో మబ్బులు పట్టి రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. రాప్తాడు, కనగానపల్లి మండలాల పరిధిలో జాతీయ రహదారిపై మాత్రమే కాకుండా పల్లెల్లో సైతం పలుచోట్ల తడిసిన వేరుసెనగను రైతులు ఆరబెట్టుకుంటున్నారు.

- ఈనాడు, అనంతపురం

ఆ పాఠశాలలో ఒక్కరే..

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : ఒక్కప్పుడు విద్యార్థులతో కళకళలాడిన కాశేపల్లి ప్రాథమిక పాఠశాల ప్రస్తుతం వెలవెలబోతోంది. వంద మందికి పైగా ఉన్న ఈపాఠశాలలో రానురాను విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. చివరికి ఒక్కరు మాత్రమే మిగిలారు. గ్రామానికి చెందిన కుళ్లాయమ్మ అనే బాలిక రెండో తరగతిలో కొనసాగుతోంది. బాలికకు ఉపాధ్యాయిని నిఖిత పాఠాలు బోధిస్తున్నారు. వంట ఏజెన్సీ వాళ్లు మధ్యాహ్న భోజనాన్ని ఒక్కరికి మాత్రమే వండుతున్నారు. ఈ విద్యాసంవత్సరంలో పాఠశాల ప్రారంభానికి ముందే గ్రామంలో సర్కారు బడి ప్రత్యేకతలపై అవగాహన కల్పించినా ప్రయోజనం లేకపోయిందని ఉపాధ్యాయిని వాపోతున్నారు. ప్రైవేట్ పాఠశాలలపై ఆసక్తితో గుత్తిలోని పాఠశాలకు పిల్లల్ని చేర్పించారు. దీనిపై మండల విద్యాధికారి రాముడును వివరణ కోరగా గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు చిన్నారులను పంపాలని అవగాహన కల్పించాం. ప్రజల నుంచి స్పందన రాలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.



తరగతి గదిలో ఉపాధ్యాయిని, పడుకున్న విద్యార్థి

బ్యాంకుల సాయంతో పల్లెల్లో నీటిశుద్ధి కేంద్రాలు

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల ఆర్థిక సహకారంతో పల్లెల్లో విస్తృతంగా నీటి శుద్ధి కేంద్రాలను నెలకొల్పాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్సు హాలులో బీమా యోజన పథకాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా ప్రతి బ్యాంకు ఏదో ఒక పల్లెను ఎంపిక చేసుకుని.. నీటిశుద్ధి కేంద్రాల ఏర్పాటుకు చొరవ చూపాలని ఆయన సూచించారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ఈ కేంద్రాలు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. వానా కాలంలో తాగునీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ సమస్య నుంచి ప్రజలను గట్టెక్కించడానికి నీటిశుద్ధి కేంద్రాలను విరివిగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇదే క్రమంలో ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజనలో ప్రతి వ్యక్తిని చేర్పించాలి. ఈ పథకాల్లో నమోదు కావడం వల్ల ముందుముందు నిర్దేశిత కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం ఒనగూరుతుందన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులను తప్పక చేర్పించాలి. వెలుగు ప్రాజెక్టు ఈ ప్రక్రియపై తగిన దృష్టి సారించాలని తెలిపారు. నవంబరు 19 లోపు వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

పత్తి రైతు చిత్తు!



తాడిపత్రి పరిధిలో జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోళ్లు

➠ తగ్గిన ధర.. వ్యాపారుల మాయాజాలం ➠ ప్రారంభం కాని సీసీఐ కేంద్రాలు

ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, పెద్దవడుగూరు: కొన్నేళ్లుగా పత్తి రైతులను నష్టాలు వెంటాడుతున్నాయి. విపత్తులు దిగుబడిపై దెబ్బకొడితే.. వ్యాపారులు ధరలు తగ్గించి.. ఆర్థికంగా నష్టం కలిగిస్తున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి.. ఎంతో శ్రమించి సాగు చేస్తే దిగుబడులు అంతంతమాత్రంగా వస్తున్నాయి. వచ్చిన కొద్దిపాటి పంటనూ అమ్ముకునేందుకు నానా తంటాలు పడాల్సిన దుస్థితి. గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. దీన్ని ఆసరా చేసుకున్న వ్యాపారులు రెండు వారాల వ్యవధిలోనే క్వింటాలుపై రూ. వెయ్యి తగ్గించేశారు. రూ.6 వేల నుంచి రూ. 6,500 మాత్రమే చెల్లిస్తున్నారు. గత్యంతరం లేక రైతులు తక్కువ ధరకే విక్రయిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో సాగు తీరు..

జిల్లా	సాగైంది (ఎకరాలు)	దిగుబడి అంచనా (క్వింటాళ్లు)
అనంతపురం	42,795	3.42 లక్షలు
శ్రీసత్యసాయి	5,322	42 వేలు

సగానికి సగం పడిపోయి..!

కొన్నేళ్లుగా నష్టాలు వస్తుండటంతో ఈ ఏడాది పత్తి సాగు తగ్గిపోయింది. జూన్‌లో వర్షాలు కురిసినా జులైలో లోటు వర్షపాతంతో పంట ఎదుగుదల నిలిచిపోయింది. చెట్టుకు 20 కాయలకు మించి రాలేదు. ఫలితంగా ఎకరాకు 15 క్వింటాళ్లకు పైగా రావాల్సిన దిగుబడి 7 క్వింటాళ్లు రావడం లేదని రైతులు వాపోతున్నారు. పత్తి తీసే సమయంలో భారీ వర్షాలు రావడంతో నల్లగా మారుతోంది. చెట్టుపై మిగిలిన కాయలు సైతం వర్షానికి రాలిపోతున్నాయి. ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టగా.. అది కూడా వచ్చే పరిస్థితి లేదని కర్షకులు వాపోతున్నారు.

కోతలు మొదలైనా..

ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు సీసీఐ ఒక్క కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించలేదు. ఇప్పటికే జిల్లా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి సీసీఐకి ప్రతిపాదనలు పంపించారు. తాడిపత్రి, గుత్తి, రాయదుర్గం ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరగా.. తాడిపత్రి, గుత్తి కేంద్రాలకు అనుమతిచ్చింది. రాయదుర్గంపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. 3 వారాల నుంచి పత్తి కోతలు ప్రారంభమయ్యాయి. కొన్నేళ్లుగా సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఆలస్యమవుతుండటంతో రైతులు వ్యాపారులకే అమ్ముకుంటున్నారు. సెప్టెంబరు చివరి వారంలో రూ.8 వేలు పలికిన ధర ప్రస్తుతం రూ.6,500 మించడం లేదు. ఫలితంగా ఒక్కో రైతు సగటున రూ.50 వేల వరకు నష్టపోతున్నారు. మరికొందరు రైతులు ఇళ్లల్లో పత్తిని నిల్వ చేసుకుంటున్నారు.

వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ఏటా మద్దతు ధర ప్రకటిస్తున్నా సీసీఐ కేంద్రాలు ఏర్పాటులో తీవ్ర జాప్యం చేస్తున్నారు. అప్పు తెచ్చి పెట్టుబడులు పెట్టిన రైతులు అన్ని రోజులు ఆగలేరు. ఐదెకరాల్లో పత్తి సాగు చేశాను. వ్యాపారులు రూ.6,500 మించి ఇవ్వడం లేదు. క్వింటాలు ధర రూ.8 వేలు దాటితేనే గిట్టుబాటు అవుతుంది.

- నాగేశ్వర్‌రెడ్డి, కొట్టాలపల్లి, పెద్దవడుగూరు

గత్యంతరం లేకే అమ్ముతున్నాం



ఆరు ఎకరాల్లో పత్తి సాగుచేశా. గత నెలలో రూ.8 వేలు పలికిన ధర ఇప్పుడు రూ.6 వేలకు పడిపోయింది. తేమ శాతం సాకుగా చూపి వ్యాపారులు ధర తగ్గించేస్తున్నారు. గత్యంతరం లేకనే వ్యాపారులకు పంటను అమ్ముతున్నాం. సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తేనే మేలు జరుగుతుంది.

- ఆంజనేయులు గౌనూర్, బొమ్మనహాళ్

కొత్త డీఆర్‌ఓ నియామకం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) జి.రామకృష్ణారెడ్డి బదిలీ అయ్యారు. నూతన డీఆర్‌ఓగా పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న ప్రత్యేక ఉప కలెక్టర్ (ఎస్‌డీసీ) ఎ.మలోలను నియమించారు. ప్రస్తుత డీఆర్‌ఓ ఈ ఏడాది ఫిబ్రవరి 5న పదవీ బాధ్యతలు స్వీకరించారు. తొమ్మిది మాసాల పాటు పని చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో కష్టపడి పని చేశారన్న పేరు ఉంది. కొత్త డీఆరోఓ మలోల గతంలో అనంత డివిజన్ ఆర్‌డీఓగా పని చేశారు. రెండో మూడు రోజుల్లో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

వేదవతి హగరి ఉగ్రరూపం

భయాందోళనలో పరివాహక ప్రజలు



కర్ణాటకలోని జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: కర్ణాటక ప్రాంతంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు జలాశయాలు పూర్తిగా నిండటంతో గేట్లను ఎత్తివేశారు. దీంతో వేదవతి చిన్న, పెద్ద హగరి నదులు ఉగ్రరూపం దాల్చాయి. గురువారం కర్ణాటకలోని మొలకాల్మూరు తాలూకాలోని రంగయ్యగుడ్డద జలాశయం గేట్లను ఎత్తడంతో వేదవతి చిన్న హగరికి నీటి మట్టం పెరుగుతోంది. బీటీపీ గేట్లను ఎత్తడంతో వేదవతి పెద్ద హగరికి నీరు చేరి, రెండు నదులు బొమ్మనహాళ్ మండలం సంగమేశ్వరాలయం వద్ద కూడలిలో కలిశాయి. దీంతో కల్లుదేవనహళ్లి వద్ద వేదవతి హగరి ఉగ్రరూపం దాల్చింది. వివిధ రకాల పంటలు మునిగి కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లింది. హగరి పరివాహక గ్రామాలైన బొల్లనగుడ్డం, హరేసముద్రం, శింగానహళ్లి, బండూరు, గౌనూరులో వరదనీరు గ్రామాల్లోకి వస్తాయోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వరద తాకిడికి విద్యుత్తు నియంత్రికలు, స్తంభాలు, పైపులైన్‌లు కొట్టుకుపోవడంతో తాగు, సాగు నీటికి కష్టాలు ఏర్పడ్డాయి. వెంటనే ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగు, సాగు నీరు అందించాలని, అధికారులు నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందేలా చూడాలని కోరుతున్నారు.



ఉద్దేహాళ్ వద్ద కాజ్‌వేపై ప్రవాహం

తాగునీటి కష్టం ఎన్నటికి తీరేను

● అర్ధాంతరంగా ఆగిన పథకాలు ● పుర ప్రజలకు కష్టాలు

గుత్తి, తాడిపత్రి పురపాలికల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ప్రధాన తాగునీటి పథకాలన్నీ ఉనికి కోల్పోయాయి. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నీటి పథకాలన్నీ నిర్వీర్యమయ్యాయి. ఫలితంగా గుక్కెడు నీటి కోసం పురవాసులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈనేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిస్థితిపై పరిశీలన కథనం.



గుత్తిలో నిలిచిపోయిన తాగునీటి పథకం సంపు నిర్మాణం

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి పురపాలికలో తాగునీటి సమస్య తీరడం లేదు. పురపాలికలోని గుత్తి, గుత్తిఆర్.ఎస్, చెట్నేపల్లి, సూరశింగనపల్లిలో పరిస్థితి జఠిలంగా ఉంది. ఇదివరకు నెలకోసారి నీటి సరఫరా జరిగేది. గుత్తి చెరువుకు హంద్రీనీవా నీరు చేరడంతో 15రోజులకోసారి గొంతులు తడుపుతున్నారు. నాలుగు నెలల కిందట వరకు పురపాలికలో ప్రజలు తాగునీటి కోసం రోడ్డెక్కారు. పోరాటం చేస్తే నీరు సరఫరా అయ్యే పరిస్థితికి వచ్చిందని పట్టణవాసులు వాపోతున్నారు.

పథకాలన్నీ నిర్వీర్యం

● గుత్తి పరిధిలో కొత్తపేట వద్ద బోర్లు వేసి గుత్తికి సుమారు 3 కి.మీ. దూరం వరకు పైపులైన్‌ను ఏర్పాటు చేశారు. బోర్లలో నీటి ఊట తగ్గి పథకం మూలకు చేరింది.

● కొన్నేళ్ల కిందట బసినేపల్లి వద్ద బోర్లు వేసి గుత్తిఆర్.ఎస్.కు తాగునీరు అందించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీనికి గాను రూ.15 లక్షలు వెచ్చించినా వృథా అయింది.

● చెట్నేపల్లిలో 25 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన తాగునీటి పథకం ప్రారంభానికి ముందే మూలన పడింది. ఫలితంగా నీటి కష్టాలు తప్పలేదు.

రూ.173 కోట్లతో పనులు చేపడతాం



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తాగునీటి సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అంటున్నారు. ఇప్పటికే గుత్తిచెరువుకు హంద్రీనీవా నీటిని నింపామన్నారు. బోర్లలో నీటి లభ్యత పెరుగుతోందని, రూ.173 కోట్లతో తాగునీటి పథకాన్ని పూర్తి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే పురపాలికశాఖ మంత్రి నారాయణతో పథకం పూర్తికి చర్చించామని, అసెంబ్లీ సమావేశాల్లో పథకం అమలుకు మంత్రితో మరోమారు మాట్లాడతామన్నారు. పథకాన్ని గతంలో తెదేపా ప్రభుత్వం మంజూరు చేయగా వైకాపా ప్రభుత్వం మూలనపడేసింది. ఆ పనులను తిరిగి ప్రారంభిస్తామన్నారు. **-గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యే, గుంతకల్లు**

పురపాలిక	గుత్తి	తాడిపత్రి
వార్డులు	25	36
జనాభా	58 వేలు	1.30 లక్షలు
తాగునీటి అవసరం	38 లక్షల లీటర్లు	16.2 లక్షల లీటర్లు
సరఫరా అవుతున్నది	25 లక్షలు	8 లక్షలు
పథకాలు	వైటీ చెరువు, సత్యసాయి	జేసీ నాగిరెడ్డి
పవర్ బోర్లు	134	23

అమృతధార అందేనా?

తాడిపత్రి, తాడిపత్రి పట్టణం న్యూస్‌టుడే: తాడిపత్రి పుర ప్రజలకు రోజూ తాగునీరు అందించేందుకు అమృత్ పథకం ద్వారా గండికోట నుంచి పైపు లైన్ ఏర్పాటుకు 2017లో రూ.14కోట్లు మంజూరు చేశారు. అప్పట్లో నిర్మాణ పనులు బాగానే జరిగినా, 2019లో ప్రభుత్వం మారి వైకాపా అధికారంలోకి రావడంతో ఐదేళ్లపాటు బిల్లులు రాలేదని పనులు ఆపేశారు. ప్రజలకు రోజూ తాగునీరు అందించాలనే లక్ష్యం ఆగిపోయింది.



సజ్జలదిన్నె వద్ద అసంపూర్తిగా..

బోరుబావులే దిక్కు..

తాడిపత్రి వాసులకు రెండు రోజులకోసారి గంట సమయం తాగునీటిని సరఫరా చేస్తున్నారు. వేసవిలో అయితే మూడు, నాలుగు రోజులకోసారి నీటి సరఫరా జరుగుతుంది. ప్రస్తుతం పెన్నానదిలో ఉన్న 23 బోరుబావులే ప్రధాన నీటి వనరు. వేసవిలో ఆ బోరుబావులు ఎండిపోతే తాగునీటి ఎద్దడితో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. అమృత్ పథకం పూర్తయితే గండికోట నుంచి వచ్చే నీటిని నిత్యం ప్రజలకు అందించొచ్చు.

శాశ్వత పరిష్కారం చూపుతాం



ఇది వరకు తాడిపత్రి వాసుల తాగునీటి సౌకర్యార్థం తెదేపా ప్రభుత్వంలో అమృత్ పథకాన్ని ప్రారంభించింది. అప్పట్లో నిర్మాణ పనులు వేగవంతంగా సాగాయి. వైకాపా ప్రభుత్వంలో ఆ పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం అమృత్ పథకాన్ని ఉనికిలోకి తీసుకొస్తాం. ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. సీఎంతోనే చర్చించాం. త్వరలోనే పనులు ప్రారంభించి నీటి సమస్య లేకుండా చేస్తాం. **-జేసీ అస్మిత్‌రెడ్డి, ఎమ్మెల్యే, తాడిపత్రి**

ఒకటో తరగతి నుంచే హిందీ అమలు చేయాలి

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి హిందీ భాషను పాఠ్యాంశంగా అమలు చేయాలని హిందీ ప్రచారసభ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీఎల్ నాయుడు, గైబువల్లీ విజ్ఞప్తి చేశారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, పరిశ్రమల శాఖమంత్రి టీజీ భరత్, విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్‌లను హిందీప్రచారసభ ప్రతినిధులు రాజధానిలో వేరువేరుగా కలిశారు. వారికి వినతి పత్రాలు అందజేశారు. మెగా డీఎస్సీలో హిందీ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఆదర్శ పాఠశాలల్లో హిందీ పీజీటీలు లేరని తెలిపారు. జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో హిందీ అధ్యాపకుల కొరత ఉందన్నారు. గత ప్రభుత్వం హిందీ పండిట్ల ప్రవేశాలు నిలిపేసిందన్నారు. ప్రవేశాలు పునరుద్ధరించాలని కోరారు.



మంత్రి అచ్చెన్నాయుడును సన్మానిస్తున్న హిందీ ప్రచార సభ ప్రతినిధులు

తోడు దొంగలు

● కొలిక్కివచ్చిన బత్తలపల్లి మండలం రామాపురం కాల్పుల ఘటన కేసు

ధర్మవరం, బత్తలపల్లి, న్యూస్‌టుడే: గుప్తనిధుల తవ్వకాల్లో పురాతన బంగారం దొరికిందని, రెండు కిలోలు రూ.ఐదు లక్షలకే ఇస్తామని ఒక ముఠా మరో ముఠాకు ఎరవేసింది. 2 కిలోల బంగారం తీసుకెళ్లేందుకు వచ్చిన మరో ముఠా డబ్బుకు బదులు నకిలీనోట్లు ఇచ్చి పోలీసుల వేషధారణలో బంగారం ఎత్తుకెళ్లాలని పన్నాగం పన్నింది. పరస్పరం మోసగించేందుకు రెండు ముఠాలు తోడుదొంగలుగా మారి.. చివరకు పోలీసులకు పట్టుబడ్డారు. వివరాలు.. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం బస్టాప్ వద్ద ఈనెల 20న ఆదివారం పట్టపగలే తుపాకీ కాల్పుల ఘటన జరగడం కలకలం రేపింది. అన్నమయ్య జిల్లా శికారీపాలెంకు చెందిన కొందరు నకిలీ బంగారం ఎరవేసి డబ్బు కాజేసే ముఠాగా పోలీసుల రికార్డుల్లో ఉన్నారు. గుప్తనిధుల తవ్వకాల్లో రెండు కిలోల బంగారం దొరికింది. తక్కువ ధరకే ఇస్తామని హైదరాబాద్‌కు చెందిన నరేష్ అనేవ్యక్తికి ఎరవేశారు. ఇందులో శికారీపాలెం ముఠాకు చెందిన రాణాహర్ కీలకంగా వ్యవహరించాడు. ఇత్తడికి బంగారు పూత వేయించి బంగారాన్ని పరీక్షించుకోవాలని నరేష్‌కు ఎరవేశాడు. శికారీపాలెం ముఠా చూపించిన ఇత్తడిపూత కడ్డీని పరీక్ష చేయించగా పైపూతను పరీక్షించిన వారు బంగారంగానే భావించారు. రూ.5 లక్షలకు 2 కిలోల బంగారం ఇచ్చేందుకు శికారీపాలెం ముఠా అంగీకరించిందని నరేష్ హైదరాబాద్‌కు చెందిన అరవింద్ నాగరాజు, రితీష్‌లకు చెప్పాడు. యూట్యూబర్ అయిన అరవింద్ సైబర్ పోలీసులతో సన్నిహితంగా మెలిగేవాడు.

కాజేయాలని పథకం వేసి..

రెండు కిలోల బంగారాన్ని రూ.5 లక్షలు డబ్బు ఇవ్వకుండా కాజేయాలని నరేష్‌తో కలసి పథకం వేశాడు. అన్నమయ్య జిల్లా శికారీపాలెం నుంచి తాము ద్విచక్ర వాహనాల్లో వస్తున్నామని, రెండు కిలోల బంగారం తెస్తున్నామని, బత్తలపల్లి మండలం రామాపురం వద్దకు రావాలని శికారీపాలెం ముఠా హైదరాబాద్‌కు చెందిన నరేష్‌కు ఫోన్‌లో తెలిపారు. డబ్బు తీసుకొస్తున్నానని, ఒక కారులో నరేష్‌తో పాటు మరికొందరు రాగా మరో కారులో అరవింద్, నాగరాజు, రితీష్ మరికొందరు వచ్చారు. రామాపురం బస్టాప్ వద్ద నకిలీ బంగారం నరేష్‌కు శికారీపాలెం ముఠా ఇచ్చే సమయంలో ఇంకో కారులో వచ్చిన అరవింద్ బృందం సఫారీ దుస్తులు ధరించి ఎయిర్ పిస్టల్‌తో గాల్లో కాల్పులు జరిపారు. దీంతో పోలీసులు వచ్చారని శికారీపాలెం ముఠా నకిలీ బంగారం కడ్డీలను అక్కడే వదిలి పరారయ్యారు. బత్తలపల్లి పోలీసులకు మొదట శికారీపాలెం ముఠాకు చెందిన బంగారీ అనే యువకుడు పట్టుబడ్డాడు. దీంతో కేసు కొలిక్కి వచ్చింది. సైబర్ పోలీసులమని చెప్పి తప్పించుకున్న హైదరాబాద్ ముఠా విషయాన్ని తెలంగాణ పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి ఏపీ పోలీసులు తీసుకెళ్లారు. రెండు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు రామాపురం కాల్పుల ఘటనపై వేగవంతంగా విచారణ చేయించారు. రెండు ముఠాలకు చెందిన 12 మంది పట్టుబడటంతో వారి అరెస్టును చూపించేందుకు బత్తలపల్లి పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నారు.

జాతీయస్థాయి జూడో పోటీలకు విద్యార్థిని ఎంపిక



ఎంపికైన విద్యార్థినితో వ్యాయామోపాధ్యాయురాలు

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి జూడో పోటీలకు సీకేపల్లి కస్తూరిబా విద్యార్థిని మౌనిక ఎంపికైనట్లు విద్యాలయ ప్రత్యేక అధికారిణి సువర్ణ పేర్కొన్నారు. స్థానిక విద్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ.. ఈనెల 20, 21 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారన్నారు. ఆ పోటీలలో పాల్గొన్న మౌనిక అండర్-17 63 కిలోల విభాగంలో అత్యుత్తమ ప్రతిభ చాటడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. విద్యార్థిని మౌనిక స్థానిక విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యనభ్యసిస్తోందన్నారు. డిసెంబరులో త్రిపురలో నిర్వహించే జాతీయ స్థాయి జూడో పోటీలలో పాల్గొంటుందన్నారు.

కార్తిక మాసానికి ప్రత్యేక బస్సులు సిద్ధం చేయాలి

అశోక్‌నగర్ (అనంతపురం ఆర్టీసీ), న్యూస్‌టుడే: కార్తిక మాసానికి ఆయా ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను సిద్ధం చేసుకోవాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని అధికారులకు సూచించారు. గురువారం ఆర్ఎం కార్యాలయంలో ఆర్టీసీ జిల్లా అధికారులు, జిల్లాలోని డిపో మేనేజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నవంబరు 2 నుంచి కార్తిక మాసం ప్రారంభం కానుండటంతో శైవక్షేత్రాలకు అవసరం అయిన బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. దసరా సందర్భంగా నడిపిన ప్రత్యేక బస్సుల వల్ల ఆర్టీసీకి మంచి ఆదాయం ఒనకూరడంతో పాటు ప్రయాణికులను గమ్య స్థానాలకు సకాలంలో చేర్చామన్నారు.

నాయీబ్రాహ్మణులకు తెదేపా అండ



ప్రదర్శన నిర్వహిస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం, తెదేపా నాయకులు

హిందూపురం, న్యూస్‌టుడే: నాయీ బ్రాహ్మణులకు తెలుగుదేశం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర నాయకులు నాగరాజు, పట్టణ తెదేపా అధ్యక్షుడు డీఈ రమేశ్‌కుమార్ తెలిపారు. నాయీబ్రాహ్మణులకు దేవాలయాల్లో చోటు కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ కూడలిలో సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే బాలకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు నరసింహారెడ్డి, అధ్యక్షుడు మంజునాథ్, వర్కింగ్ ప్రెసిడెంట్ హరి, ఉపాధ్యక్షులు నాగేశ్, నరేశ్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి రఘు, ప్రచార కార్యదర్శి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ ప్రాధికార సంస్థ సభ్యులుగా ఎస్కేయూ, జేఎన్‌టీయూ ఆచార్యులు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ పర్యావరణ ప్రభావ మదింపు ప్రాధికార సంస్థ రాష్ట్ర స్థాయి నిపుణుల పరిశీలన కమిటీలో ఎస్కేయూ, జేఎన్‌టీయూలకు చెందిన ముగ్గురు ఆచార్యులకు స్థానం దక్కింది. భారత పర్యావరణ మంత్రిత్వశాఖ ఈ కమిటీ నియమించింది. జేఎన్‌టీయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఆచార్యురాలు భవాని, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యులు సుధాకర్‌బాబు, అర్థశాస్త్రం విభాగానికి చెందిన మరో ఆచార్యుడు కమిటీలో సభ్యులుగా నియమితులయ్యారు. ఆచార్య సుధాకర్‌బాబు ఎస్కేయూ రిజిస్ట్రార్‌గా పనిచేశారు. పర్యావరణంపై ఆయన విస్తృత పరిశోధనలు నిర్వహించారు. ఆచార్య భవాని జల కాలుష్యంపై పరిశోధనలు చేశారు. ఆమె పరిశోధనలకు పేటెంట్ కూడా దక్కింది.

జూనియర్ న్యాయవాది బలవన్మరణం

● ఉద్యోగం రాలేదని మనస్తాపం: కుటుంబసభ్యులు



రుక్సానా

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం కోర్టులో జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న రుక్సానా (27) గురువారం బలవన్మరణానికి పాల్పడింది. రెండో పట్టణ ఎస్సై రుషేంద్రబాబు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు. శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం సిద్దరాంపురం గ్రామానికి చెందిన లాలూసాబ్, దిల్‌షద్‌లకు ముగ్గురు కుమార్తెలు. పెద్దమ్మాయి రుక్సానా ఎంకామ్ ఎల్ఎల్‌బీ పూర్తి చేసి జిల్లా కోర్టులో ఓ సీనియర్ లాయర్ వద్ద ప్రాక్టీస్ చేస్తోంది. రెండేళ్లుగా తన చెల్లెళ్లు రేష్మా, కౌసర్‌లతో కలిసి స్థానిక కోర్టు రోడ్డులో ఓ ఇంట్లో నివాసం ఉంటున్నారు. రోజులాగే చెల్లెళ్లు కళాశాలలకు వెళ్లారు. మధ్యాహ్నం సోదరి కళాశాల నుంచి వచ్చింది. తలుపులు తెరిచి చూడగా గదిలో రుక్సానా ఉరికి వేలాడుతూ కనిపించింది. భయపడిన అమ్మాయి పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. స్థానికులు, టూటౌన్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందింది. ఎస్సై రుషేంద్రబాబు ఘటనపై స్థానికులు, పక్కింటి వారిని ప్రశ్నించారు. క్లూస్ టీం ఘటనాస్థలిలో ఆధారాలు సేకరించారు. జాగిలంతో పరిసరాలను పరిశీలించారు. తండ్రి లాలుసాబ్ టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. 'తమ కుమార్తె చదువు పూర్తయినప్పటి నుంచి పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతుండేదని, ప్రభుత్వ ఉద్యోగం రాలేదనే అసంతృప్తి ఉండేదని, తమతో తరచూ బాధను వ్యక్తం చేసేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు.

మృతిపై పలు అనుమానాలు

న్యాయవాది మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉరికి వేలాడుతున్న మృతదేహం కాళ్లు నేలపై పూర్తిగా ఆనుకుని ఉన్నాయి. రాత్రి గానీ, అంతకు ముందు గానీ చెల్లెళ్లతో ఎలాంటి బాధను వ్యక్తం చేయలేదని, సంతోషంగా ఉందని తెలుస్తోంది. ఆత్మహత్య చేసుకునేంత బలహీన మనస్తత్వం కాదనీ సహచరులు, బంధువులు చెబుతున్నారు. ఇవన్నీ పోలీసులు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

వరద బాధితులను ఆదుకోండి: సునీత



కనగానపల్లిలో తెగిన చెరువు కట్టను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

కనగానపల్లి, రాప్తాడు, న్యూస్‌టుడే: వరదలతో రాప్తాడు నియోజకవర్గంలో పంటలకు అపార నష్టం వాటిల్లిందని, చాలామంది గృహాలను కోల్పోయారని వారందరినీ ఆదుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. గురువారం కనగానపల్లి మండల కేంద్రంలో తెగిన చెరువు కట్టతోపాటు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అనంతరం పంటలను కోల్పోయిన రైతులతో కలెక్టరు, ఎమ్మెల్యే మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కనగానపల్లిలో 198.2 మీమీ వర్షం కురవడం వల్ల చెరువు తెగినట్లు వివరించారు. చెరువు మరమ్మతుకు రూ.50 లక్షలు, పంటలు కోల్పోయిన రైతులకు పరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు రైతులతో కలిసి సునీత వినతిప్రతం అందజేశారు.

ఇళ్ల నిర్మాణాల్లో అవినీతి జలగ రాక్రీట్

పేదల ఇళ్లనిర్మాణాల పేరుతో గత ఐదేళ్లలో అవినీతికి పాల్పడిన వారిని వదిలేదిలేదని సునీత అన్నారు. రాప్తాడు ఎంపీడీవో కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ, రెవెన్యూ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణాల పేరుతో జరిగిన దోపిడీ గురించి ప్రధానంగా ప్రస్తావించారు. ఆలమూరు, రాచానపల్లి కాలనీల్లో రాక్రీట్ సంస్థ ఇళ్లు నిర్మించేలా అనుమతులు ఇచ్చారని, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి చెందిన ఆ సంస్థ అనేక అవినీతి కార్యక్రమాలకు పాల్పడిందన్నారు. వీటిపై విజిలెన్స్ విచారణ జరుగుతోందన్నారు. అనంతపురం శివారు కాలనీల్లో ఇళ్లు లేని పేదలకు కాకుండా కార్లలో వచ్చేవారికి, వైకాపా నాయకులకు, కార్యకర్తలు, బినామీలకు ఇళ్లు ఇచ్చారని సునీత ఆరోపించారు. ప్రతి గ్రామంలో కాలనీల్లో ఇళ్లు పొందిన లబ్ధిదారుల్లో చాలామంది వాటిని అమ్ముకున్నారని, అన్నింటిపై విచారణ చేయాలన్నారు.

మనస్తాపంతో నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నం

తనకల్లు, న్యూస్‌టుడే: ఒంటిపై పెట్రోల్ పోసుకొని వ్యక్తి నిప్పంటించుకున్న ఘటన మండలంలోని బాలసముద్రం పంచాయతీ మారప్పగారిపల్లిలో గురువారం జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. వెంకటరమణ, నరసింహులు ఇళ్లు ఎదురెదురుగా ఉన్నాయి. మురుగు విషయమై కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. గురువారం మరోమారు గొడవ జరగడంతో మనస్తాపం చెందిన వెంకటరమణ, భార్య, ఇద్దరు పిల్లలు ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు. స్థానికులు సర్దిచెప్పడంతో మిన్నకుండిపోయిన భార్య, పిల్లలు వారి పనుల్లో నిమగ్నమయ్యారు. ఇంతలో వెంకటరమణ నిప్పంటించుకొని ఇంట్లో నుంచి బయటకు రాగా స్థానికులు గుర్తించి మంటలు ఆర్పివేశారు. తనకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి కదిరి ప్రాంతీయ వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు తిరుపతికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



అలివేలమ్మ

పెనుకొండ, న్యూస్‌టుడే: మిద్దెపై దుస్తులు ఆరవేయడానికి వెళ్లిన ఓ మహిళ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. పోలీసులు, గ్రామస్థుల వివరాల మేరకు.. మండలంలోని మరువపల్లి గ్రామానికి చెందిన అలివేలమ్మ(45) గురువారం ఉదయాన్నే దుస్తులు ఉతికి ఆరవేసేందుకు మిద్దెపైకి వెళ్లారు. పక్కనే ఉన్న విద్యుత్తు తీగలు చేతికి తగిలి ఆమె మృతి చెందారు. ఆమెకు నలుగురు కుమార్తెలు ఉన్నారు. అందరికీ వివాహం జరిపించారు. విద్యుత్తుశాఖ ఏఈ నారాయణస్వామి, ఏడీ వివేకానంద ఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత మృతురాలి భర్త రామచంద్రను ఫోన్‌లో పరామర్శించారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని, ప్రభుత్వం నుంచి రూ.5లక్షల పరిహారం అందజేస్తామని భరోసా ఇచ్చారు. పార్టీశ్రేణుల ద్వారా అంత్యక్రియల కోసం రూ.10 వేలు నగదు అందజేశారు.

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ



ఛైర్పర్సన్ పొరాళు శిల్పకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

రాయదుర్గం: పురపాలక సంఘంలో దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కార్మికులు ఛైర్పర్సన్ పొరాళు శిల్ప, కమిషనర్ దివాకర్రెడ్డిలకు వినతిపత్రాలు అందజేశారు. ప్రతినెలా 1వ తేదీన జీతాలు చెల్లించి, సకాలంలో కార్మికులకు అవసరమైన పనిముట్లు పంపిణీ తదితర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. తమ పరిధిలో వచ్చే సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

రిజిస్ట్రేషన్లలో పారదర్శకత అవసరం



డీఐజీ విజయలక్ష్మి

ఉరవకొండ, న్యూస్టుడే: ఆస్తుల రిజిస్ట్రేషన్లలో కచ్చితంగా నిబంధనలు పాటించేలా చూస్తున్నామని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం ఉరవకొండ సబ్రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతపురం, సత్యసాయి జిల్లాలకు కేటాయించిన ఆదాయ లక్ష్యాన్ని చేరుకునే దిశగా ప్రణాళికతో ముందుకు పోతున్నామన్నారు. అనంతపురం జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.56.35 కోట్ల ఆదాయ సాధనే లక్ష్యం కాగా, గత నెలాఖరు నాటికి రూ.23.03 కోట్లు సమకూరినట్లు వివరించారు. సత్యసాయి జిల్లాకు రూ.29.82 కోట్ల లక్ష్యంగా గత నెలాఖరుకు రూ.12.03 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. మిగతా లక్ష్యాన్ని ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే నాటికి చేరుకుంటామన్నారు. అనంతరం దస్త్రాలు పరిశీలించారు. ఆమె వెంట స్థానిక సబ్ రిజిస్ట్రార్ హనుమ నాయక్ ఉన్నారు.

నిర్లక్ష్యపు నీడలో తటాకాలు

● గత ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోని తీరు
● బలహీన కట్టలతో తప్పని ముప్పు

కళ్యాణదుర్గం (గ్రామీణం): గత వైకాపా ప్రభుత్వం అలసత్వం, పాలకుల నిర్లక్ష్యంతో మూడేళ్లుగా చెరువులు అభివృద్ధికి నోచుకోలేక పోయాయి. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ముప్పు తప్పడం లేదు. ఇటీవల భారీగా వర్షాలు కురుస్తుండటంతో చెరువుల్లోకి వరదనీరు చేరుతున్నాయి. అధికారులు చెట్లు పెరగడంతో చెరువు కట్టలు దెబ్బతింటున్నాయి. జపాన్ బ్యాంకు నిధులతో మూడేళ్ల కిందట పనులు ప్రారంభించినా ప్రయోజనం లేకపోయింది. పలు చెరువులు ఇంకా పనులు ప్రారంభం కాక, మరికొన్ని చెరువులకు పనులు చేసినా బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు ముందుకు రావడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● నియోజకవర్గ వ్యాప్తంగా 28 పెద్ద, 48 చిన్న చెరువులు ఉన్నాయి. హులికల్లు చెరువు మరమ్మతుకు ప్రపంచ బ్యాంకు నిధులు, బైరసముద్రం, నూతిమడుగు, డి. చెన్నంపల్లి చెరువుల మరమ్మతులకు జపాన్ నిధులు 2019లో వచ్చాయి. చెరువుల్లో పూడిక తీయకపోవడం, చెట్లు పెరగడంతో వర్షపు నీటితో ముంపు కలిగే ప్రమాదం లేకపోలేదు.

● కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనపల్లి చెరువు తెగిపోగా ఎమ్మెల్యే సురేంద్రబాబు చొరవతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. వర్లి, గూళ్యం, పాళ్లూరు, రాళ్ల అనంతపురం, బ్రహ్మసముద్రం, కన్నేపల్లి, గుండ్లపల్లి, సంతేకొండాపురం, కోనాపురం, పాలవెంకటాపురం, ఎరడికెర, హులికల్లు, ములకలేడు, పోలేపల్లి, సంతేకొండాపురం తదితర చెరువులకు భారీ వర్షాల కారణంగా గండ్లు పడ్డాయి. నాయకులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

ఇప్పటి వరకు జరిగిన పనుల వివరాలు..

గ్రామం	నిధుల లక్ష్యం (రూ.లక్షలు)	జరిగిన పనులు (రూ.లక్షలు)
బైరసముద్రం	40	28
హులికల్లు	60	37
డి.చెన్నంపల్లి	18	11
నూతిమడుగు	31	14



ఆగస్టులో తెగిన ముద్దినాయనపల్లి చెరువు



పాలవాయి చెరువులో ముళ్లపొదలు

బిల్లులు రాక పనులు జరగలేదు

గతంలో నియోజకవర్గంలోని పలు చెరువులకు జపాన్, ప్రపంచ బ్యాంకు నిధులతో పనులు జరిగాయి. యాటకల్లు, సంతేకొండాపురం చెరువుల పనులు ప్రారంభం కాలేదు. కొన్నిచోట్ల బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు ముందుకు రాలేదు. ప్రస్తుతం చెరువుల్లో భారీగా నీరు చేరాయి. ఎక్కడైనా సమస్యలొస్తే మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. **- దామోదర్, డీఈ, ఇరిగేషన్**

ఉన్నత లక్ష్యాలు సాధించాలి

వజ్రకరూరు, న్యూస్టుడే: జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను గురువారం డిప్యూటీ డీఈఓ శ్రీదేవి సందర్శించారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని సాధించడానికి కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, పరీక్షలకు సన్నద్ధం కావాల్సిన విధానంపై అవగాహన కల్పించాలని, పాఠశాలలో మౌలిక వసతులపై ఆరా తీశారు.

సమస్యలతో సతమతమవుతున్నారా!

రాయదుర్గం మున్సిపాలిటీలో తాగునీరు సరిగా సరఫరా కావడం లేదా? వీధి దీపాలు వెలగడం లేదా? మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదా? వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోతుందా. తాగునీటి పైపులైన్ లీకవుతుందా? కుక్కలు, పందుల బెడద అధికంగా ఉందా? శివారు కాలనీల సమస్యలు పట్టించుకోవడం లేదా? ఇలాంటి సమస్యలతో సతమతమవుతున్నారా? వీటి పరిష్కారానికి 'ఈనాడు - మేమున్నాం.. మీకు తోడుగా' వేదికగా కమిషనర్తో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. మీరు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలు తెలుపండి. అవి పరిష్కారమయ్యేలా చూస్తాం. ఇందుకోసం ఆలస్యం. వెంటనే ఫోన్ చేసి సమస్య వివరించండి.

తేదీ: 25.10.2024 (శుక్రవారం)
సమయం: ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ✆ 98499 05858

ఆలయ నిర్మాణానికి విరాళం

బ్రహ్మసముద్రం, న్యూస్టుడే: భైరవానితిప్ప ప్రాజెక్టు కింద ఉన్న సావరమ్మ ఆలయ పునః నిర్మాణానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రూ.2 లక్షలు విరాళం ఇచ్చారు. గురువారం బీటీపీకి వచ్చిన ఆయన స్థానిక నాయకులకు నగదును అందజేశారు. గతంలోనే ఆలయ పునః నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అందులో భాగంగా ప్రస్తుతం రూ.2 లక్షలు ఇచ్చినట్లు చెప్పారు. జడ్పీటీసీ ప్రభావతమ్మ, సర్పంచి సందీప్ పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న పార్టీ జిల్లాధ్యక్షుడు మధుసూదన్రెడ్డి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్టుడే: గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ పూర్వవైభవం తీసుకొద్దామని కాంగ్రెస్ పార్టీ జిల్లాధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న శివాలయంలో కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోకవర్గాల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయనతో పాటు జిల్లా ఇన్ఛార్జి వెంకటనరసింహులు, పీసీసీ మెంబరు రాంభూపాల్రెడ్డి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఆదరణ ఉందన్నారు. 2029లో రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే ధ్యేయమని, పలు అంశాలపై అవగాహన కల్పించారు. నాయకులు ఎర్రిస్వామి, తిమ్మప్ప, వీరయ్యచౌదరి, పక్రుద్దీన్, నాగరాజు, దాదాపీర్, ఈరన్న, ఉద్దీప్సింహ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



విద్యార్థితో ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి, పీడీ కిరణ్చౌదరి



ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, పీడీ శివమ్మ

కళ్యాణదుర్గం, న్యూస్టుడే: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ ప్రతిభ చాటడడం ఎంతో సంతోషంగా ఉందని జిల్లా పరిషత్తు నార్తు, బాలికల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, గాయత్రి, పీడీలు శివమ్మ, కిరణ్చౌదరి అన్నారు. హాకీ క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు. ఈనెల 22న ఏపీ స్కూల్ గేమ్స్ విభాగంలో అనంతపురం ఆర్డీటీ క్రీడామైదానంలో జిల్లాస్థాయి పోటీల్లో బాలికోన్నత పాఠశాలకు చెందిన అఖిల్కుమార్ (6వ తరగతి), అమృత (7వ తరగతి), జిల్లా పరిషత్తు నార్తు పాఠశాలకు చెందిన ఉదయ్కుమార్ (6వ తరగతి)లు ప్రతిభ కనపరిచారన్నారు. నవంబరు 8, 9, 10వ తేదీల్లో వైజాగ్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: శెట్టూరు ఎస్సీ కాలనీలో వర్షం వస్తే నీరు నిల్వ ఉంటూ ఇబ్బంది ఉంటుంది. **- వన్నూరుస్వామి**

సమాధానం: మట్టిని వేసి నీరు నిల్వ లేకుండా చూస్తాం. **- కుమార్, సర్పంచి**

సమస్య: చెరువుకట్ట కింద విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. **- భాస్కర్**

సమాధానం: పరిశీలించి పైకి లాగించేందుకు చర్యలు చేపడుతాం. **- సలీం, విద్యుత్తు ఏఈ**

సమస్య: మండలంలోని చెన్నంపల్లిలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- స్థానికులు**

సమస్య: మండలంలోని అచ్చంపల్లిలో అపరిశుభ్రత నెలకొడంతో అనారోగ్యాల బారిన పడుతున్నాం. **- గ్రామస్థులు**

సమాధానం: శుభ్రం చేయించి సమస్యను పరిష్కరిస్తాం.
(పై రెండు ప్రశ్నలకు పంచాయతీ కార్యదర్శి వీరశేఖర్ సమాధానాలు ఇచ్చారు.)

- శెట్టూరు, కంబదూరు, న్యూస్టుడే

ఇంకుడు గుంతలు మంజూరు

ఉరవకొండ, న్యూస్టుడే: ఉపాధి హామీ పథకం ద్వారా ఉరవకొండ మండలానికి వెయ్యి ఇంకుడు గుంతలు మంజూరైనట్లు ఏపీవో విమల గురువారం పేర్కొన్నారు. కాలువలు లేని ప్రదేశాల్లోని ఇళ్ల ముందర తవ్వుకోవడానికి అవకాశం కల్పిస్తామన్నారు. ఒక్కో గుంతకు రూ.6 వేలు ఉపాధి పథకం ద్వారా ఇవ్వనున్నామని, ఆసక్తి ఉన్న వారు ఆధార్ కార్డులతో ఉపాధి కార్యాలయంలో సంప్రదిస్తే, మంజూరుకు చర్యలు చేపడుతామన్నారు.

ఆర్టీవోగా రమేష్ బాధ్యతలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్టుడే: కళ్యాణదుర్గం ప్రాంతీయ రవాణా శాఖ అధికారిగా ఎస్. రమేష్ను ఉన్నతాధికారులు నియమించారు. గురువారం మొట్టమొదట ప్రాంతీయ అధికారిగా రమేష్ బాధ్యతలు చేపట్టారు. త్వరలో కార్యాలయం ప్రారంభించనున్నట్లు చెప్పారు.

బీటీపీకి కృష్ణాజలాలు తీసుకురావాలి

రాయదుర్గం పట్టణం, న్యూస్టుడే: బీటీ ప్రాజెక్టుకు కృష్ణాజలాలు తీసుకొచ్చేందుకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వెంటనే చర్యలు చేపట్టాలని సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టడం సంతోషదాయకమన్నారు. రాయదుర్గం ప్రాంతానికి కృష్ణాజలాలు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వంద రోజులు పనులు కల్పించాలి

రాయదుర్గం గ్రామీణం, న్యూస్టుడే: నియోజకవర్గంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అడిగిన కూలీలందరికీ వంద రోజులు పనులు కల్పించాలని అనంతపురం డ్వామా పీడీ సలీం బాషా తెలిపారు. గురువారం రాయదుర్గం డ్వామా కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో హాజరై మాట్లాడారు. ఉపాధి పథకం ద్వారా గ్రామాల్లో నిర్మిస్తున్న గోకులం షెడ్లు వెంటనే నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాయదుర్గం ఇన్ఛార్జి ఏపీడీ ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్టుడే: ప్రతి ఒక్కరూ లింగవివక్షత వీడి సమానంగా ఉండే విధంగా సామాజిక బాధ్యత తీసుకోవాలని వైద్యాధికారి విజయేంద్ర, ప్రధానోపాధ్యాయుడు రమేష్కుమార్ అన్నారు. గురువారం ముద్దినాయనపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో లింగవివక్షత నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు చేయడంతో ఏర్పడే అనర్థాలు, కలిగే నష్టాలు వివరించారు. ఆరోగ్య విస్తరణాధికారి వేణుగోపాల్రెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు సురేష్బాబు, ఏఎన్ఎం లక్ష్మీదేవి, ఆదెమ్మ పాల్గొన్నారు.

పాఠశాలలో నిధులు కాజేశారని ఫిర్యాదు

● విచారణకుఅధికారిణి రాకపోవడంపై అనుమానాలు

వజ్రకరూరు, న్యూస్టుడే: మండలంలోని కొనకొండ్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎన్సీసీ విద్యార్థుల నిధులను కాజేశారని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు ఆరోపిస్తూ గత సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి 77 మంది ఎన్సీసీ విద్యార్థులకు ప్రభుత్వం మంజూరుచేసిన రూ.3,800 నుంచి రూ.2వేలు చొప్పున తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై జేసీ శివనారాయణ శర్మ విచారణకు ఆదేశించారు. గురువారం గుత్తి నుంచి వచ్చిన డిప్యూటీ డీఈఓ శ్రీదేవి కొనకొండ్ల పాఠశాలకు వెళ్లకుండా కేవలం వజ్రకరూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి వెనుదిరగడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మండలానికి చెందిన ఓ ముఖ్య నాయకుడు ఈ విషయంలో జోక్యం చేసుకొని సమస్యను తాను పరిష్కరిస్తానని అధికారులకు చెప్పినట్లు సమాచారం. సదరు ఫిర్యాదుదారులను సైతం హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్తో మాట్లాడగా ప్రాథమిక విచారణ నివేదికను తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాయామ ఉపాధ్యాయుడు మాట్లాడుతూ తాను ఎవరి వద్ద నుంచి నగదు తీసుకోలేదన్నారు. బ్యాంకు నుంచి డ్రా చేసిన డబ్బుతో విద్యార్థులకు యూనిఫాం కిట్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులే కీలకం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రఘురామమూర్తి

రాయదుర్గం పట్టణం, న్యూస్టుడే: సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులే కీలకమని ప్రిన్సిపల్ రఘురామమూర్తి అన్నారు. గురువారం పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్సీసీ విభాగం, పోలీసుల ఆధ్వర్యంలో పోలీసుల అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలను ఫణంగా పెడుతున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు జరిగినపుడు ప్రాణాలు లెక్కచేయకుండా సేవలందిస్తున్నారని కొనియాడారు. యూపీఎస్ సీఐ జయనాయక్, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఎన్సీసీ సీటీవో జక్కల కిరణ్, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, పరీసా, గోవర్ధన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



పట్టుజారితే.. ప్రాణాలకే ప్రమాదం

మండలంలోని వివిధ ప్రాంతాలకు పనుల కోసం వెళ్లే ఆటోల్లో కూలీలు అధిక సంఖ్యలో ప్రమాదకంగా వెళ్తున్నారు. ఈ క్రమంలో పట్టు జారితే ప్రాణాలు గాల్లోకలవాల్సిందే. ఆర్టీవోలు తనిఖీలు నిర్వహించి పరిమితికి మించి తరలించే వాహనాలను అదుపు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తనిఖీలు ముమ్మరం చేస్తామన్నారు. **- న్యూస్టుడే, బొమ్మనహాళ్**

గుంతల దారితో ఇక్కట్లు

ఉరవకొండ పట్టణంలోని మల్లేశ్వర థియేటర్ వెనుక వీధిలో నివాస గృహాల మధ్య ఉన్న మట్టి దారి గుంతలు పడి అధ్వానంగా ఉంది. వర్షపు నీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు స్థానికులు అడుగు తీసి అడుగు వేయాలన్నా కష్టంగా ఉంది. సిమెంటు దారిని నిర్మించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. దీనిని పంచాయతీ కార్యదర్శి గౌస్సాహెబ్ దృష్టికి తీసుకెళ్లగా సిమెంటు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించామన్నారు. **- న్యూస్టుడే, ఉరవకొండ**





ప్రైవేటు వాహనాలతో ఇబ్బందులు

రాయదుర్గంలోని జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థినులు సైకిళ్లు పెట్టేందుకు కూడా స్థలం లేకుండా ప్రైవేటు అంబులెన్సులు నిలపడం, దుకాణాలు నిర్వహిస్తుండటంతో ఇబ్బందులకు గురవుతున్నారు. అనంతపురం వెళ్లే రహదారిలో నిలుపుతున్నారు. వాహనాలు తగిలితే సైకిళ్లు పడిపోతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు కోరుతున్నారు. **- న్యూస్టుడే, రాయదుర్గం**

భూసమస్యల పరిష్కారానికి వినతులు

కణేకల్లు, న్యూస్టుడే : భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను కోరారు. గురువారం మండలంలోని బిదురుకొంతం, గనిగెర రీసర్వే గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో రైతులు సమస్యలను అధికారులకు విన్నవించారు. జాయింట్ ఎల్పీఎంలు కేటాయించడంతో బ్యాంకు రుణాలు, నవీనకరణ, అమ్మకం, కొనుగోలుకు ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. జాయింట్ ఎల్పీఎంలు, భూవిస్తీర్ణాల సమస్యలు పరిష్కరించాలని బిదురుకొంతంలో 42, గనిగెరలో 55 వినతులు అందినట్లు తహసీల్దారు ఫణికుమార్ తెలిపారు. రీసర్వే డీటీ విజయ్, ఆర్ఐ చంద్రశేఖర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు

కణేకల్లు, న్యూస్టుడే: మండలంలోని ఆదిగానిపల్లి నుంచి కొత్తపల్లి, పుల్లంపల్లి గ్రామాల వరకు దారికి ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలను రచ్చుమర్రి సర్పంచి రుద్రముని తొలగించి తన ఔదార్యం చాటుకొన్నారు. పొక్లెయిన్తో పనులు చేపట్టి దారిని బాగు చేశారు. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో తన సొంత నిధులతో దారిని బాగు చేసినట్లు ఆయన తెలిపారు.

మద్యం దుకాణం నిర్వహణలో వివాదం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్టుడే: ప్రభుత్వం ఇటీవలే ప్రైవేట్ మద్యం దుకాణాల ఏర్పాటుకు లాటరీ పద్ధతిని నిర్వహించింది. ఇందులో కళ్యాణదుర్గానికి చెందిన ఓ వ్యక్తి మద్యం దుకాణాన్ని దక్కించుకొన్నాడు. దీనిపై మొదటి నుంచి ఇబ్బందులు నెలకొని, కొందరి మధ్య మనస్పర్థలు తలెత్తాయి. ఇరువురు మాట్లాడుకుని కొన్ని రోజుల కిందట బళ్లారి మిట్టపై దుకాణం ఏర్పాటు చేశారు. గురువారం తిరిగి సమస్య తలెత్తడంతో దుకాణం వద్ద గొడవకు దిగారు. పోలీసులు కల్పించుకుని సర్దిచెప్పి పంపారు. అనంతరం వేర్వేరుగా సమస్యను డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్టుడే: మండలంలోని ఎర్రంపల్లికి చెందిన ఓ (16) విద్యార్థిని మూడ్రోజులుగా కనిపించడం లేదని తండ్రి కళ్యాణదుర్గం పట్టణ పోలీసు స్టేషన్లో గురువారం ఫిర్యాదు చేశారు. పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్మొదటి సంవత్సరం చదువుతోందని, మంగళవారం నుంచి కనిపించడం లేదన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భూవిలువలపై పారదర్శక తనిఖీలు

రాయదుర్గం, న్యూస్టుడే: పట్టణంలోని భూమి విలువలపై పారదర్శకంగా తనిఖీలు నిర్వహించేందుకు మున్సిపల్ కమిషనర్ దివాకర్రెడ్డి, సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు నిర్ణయించారు. గురువారం మున్సిపల్ కమిషనర్ ఛాంబర్లో తనిఖీలపై చర్చించారు. పట్టణంలో ఇప్పటికే అధికంగా భూమి విలువలు ఉన్నాయని, ఒకే ప్రాంతంలో హెచ్చు తగ్గులు లేకుండా పారదర్శకంగా తనిఖీలు చేయాలన్నారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. పట్టణంలో ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లకు ప్రతి వారం రిజిస్ట్రేషన్ వివరాలు పంపాలని కమిషనర్ కోరగా సబ్రిజిస్ట్రార్ అంగీకరించారు. త్వరలో సంయుక్త తనిఖీలకు వెళ్లేందుకు నిర్ణయించినట్లు వారు వివరించారు.

ఆయా పోస్టులకు మౌఖిక పరీక్ష

కళ్యాణదుర్గం, న్యూస్టుడే: కళ్యాణదుర్గం, రాయదుర్గం, కణేకల్లు, కంబదూరు, బెళుగుప్ప సీడీపీవో ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుల భర్తీకి గురువారం మౌఖిక పరీక్ష నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయంలో ఇన్ఛార్జి ఆర్డీవో వినూత్న పరీక్ష చేపట్టారు. 21 కేంద్రాల్లో 46 మంది దరఖాస్తు చేసుకున్నారు. గర్భిణులు, పిల్లలకు ఎలాంటి వ్యాక్సిన్లు వేస్తారు, బాల్య వివాహాలు తదితర విషయాలపై అభ్యర్థులను ప్రశ్నలు అడిగారు. సీడీపీవోలు లక్ష్మీప్రసన్న, వనజాఅక్కమ్మ, పద్మా, లలిత పాల్గొన్నారు.

నూతన డీలర్ల సంఘం ఎన్నిక

బొమ్మనహాళ్, న్యూస్టుడే: బొమ్మనహాళ్ మండల డీలర్ల సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. అధ్యక్షుడిగా పయ్యావుల మోహన్, ఉపాధ్యక్షుడిగా తిప్పేస్వామి, ప్రధాన కార్యదర్శిగా ఆనంద్, కోశాధికారిగా ప్రభయ్యస్వామి, కార్యవర్గ సభ్యులుగా కాశీంవలి, భాస్కర్, హనుమంతు, వన్నూరుస్వామి, రాజులను ఏకగ్రీవగా ఎన్నుకున్నామన్నారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులను తహసీల్దార్ మునివేలు, సింగిల్విండో మాజీ అధ్యక్షుడు మల్లికార్జున, జడ్పీసీ మాజీ సభ్యుడు మల్లికార్జున, మాజీ ఎంపీపీ షణ్ముఖయ్యలు సన్మానించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

బ్రహ్మసముద్రం, న్యూస్టుడే: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పాతిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కోనాపురం, పాలవెంకటాపురం, మాముదూరు, కొండాపురం, సూగేపల్లి, ఎరిడికెర తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. స్థానికంగా ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తిమ్మప్ప, ప్రభాకర్, నరేష్కుమార్, బాలా, రామ్మోహన్, మంజునాథ, తమ్మన్న, శ్రీనివాసులు, రామన్న, జగదీశ్, చెలిమేగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స.హ. చట్టం సామాన్యులకు ఆయుధం

కుందుర్పి, న్యూస్టుడే: సమాచార హక్కు చట్టం సామాన్యులకు ఆయుధం లాంటిదని తహసీల్దారు శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స.హ చట్టం 19వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సహ చట్టం నిబంధనలకు అనుగుణంగానే వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. ఉప తహసీల్దారు తిప్పేస్వామి, మండల సమాచార హక్కు చట్టం సమాఖ్య అధ్యక్షుడు గోపాల్, సహ చట్టం ప్రతినిధులు శ్రీనివాసులు, ఈరన్న, నాగరాజు పాల్గొన్నారు.

శ్మశానానికి దారిలేక అవస్థలు

కణేకల్లు, న్యూస్టుడే: శ్మశానానికి దారి చూపాలని మండలంలోని ఆదిగానిపల్లి గ్రామ దళితులు జిల్లా కలెక్టరును వేడుకొంటున్నట్లు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన వీడియో వైరల్ అయింది. శ్మశానానికి దారి లేకపోవడంతో బుధవారం గ్రామంలో మరణించిన వ్యక్తి మృతదేహాన్ని ఓ రైతుకు ఒప్పించి పొలాల గట్ల వెంబడి మోస్తూ...తీసుకెళ్లడం దయనీయ స్థితికి అద్దం పడుతోంది. కలెక్టరు సారూ శ్మశానానికి దారి చూపి సమస్యను పరిష్కరించాలని వేడుకున్నారు.

పశుగణనకు ఏర్పాట్లు



సిబ్బందితో కలిసి గోడపత్రాలు విడుదల చేస్తున్న డాక్టర్ వెంకటేశ్

ఉరవకొండ, న్యూస్టుడే: పశుగణనను పక్కాగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశామని పశుసంవర్ధకశాఖ ఉరవకొండ డీడీ డాక్టర్ వెంకటేశ్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన గోడపత్రాలను గురువారం విడుదల చేశారు. ఈనెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు పశుగణన కొనసాగుతుందన్నారు. పశుసంపదతో పాటు జీవాల వివరాలను సేకరిస్తారన్నారు. డివిజన్లోని 15 మండలాల్లో పశుగణనకు 82 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. 18 మంది సూపర్వైజర్లు పర్యవేక్షిస్తారని, ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం

శెట్టూరు, న్యూస్టుడే: మండలంలోని కంబాలపల్లికి చెందిన జి.కృష్ణ మనస్తాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. భార్యాభర్తలు తరుచూ గొడవపడే వారని ఈ క్రమంలో గురువారం మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు చెప్పారు. గమనించిన స్థానికులు వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

రాయదుర్గం గ్రామీణం, న్యూస్టుడే: మండలంలోని మెచ్చిరి గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు కొత్తపల్లి ఆదికేశవులు హత్య కేసులో ఏ8 ముద్దాయి కాపు చెన్నారెడ్డిని గురువారం అరెస్టు చేసి, అతని వద్ద కొడవలిని స్వాధీనం చేసుకున్నట్లు రాయదుర్గం యూపీఎస్ సీఐ జయనాయక్ తెలిపారు. ఈ ఏడాది జులై 9వ తేదీన కర్ణాటక రాష్ట్రం నాగసముద్రం నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న ఆదికేశవులును ప్రత్యర్థులు నరికి చంపిన కేసులో ఇప్పటికే పలువురు అరెస్టు అయ్యారు. ఇటీవల బెయిల్పై విడుదలయ్యారు. చెన్నారెడ్డి పరారీలో ఉండగా పోలీసులు అరెస్టు చేసి రాయదుర్గం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు చెన్నారెడ్డిపై కేసు నమోదు చేశారు. ఆదికేశవులు నాయకుడిగా ఎదగడం ఓర్వలేక పాత కక్షలు మనసులో పెట్టుకొని హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

వరదతో ఆగిన నీటి పరీక్షలు

రాయదుర్గం, న్యూస్టుడే: పట్టణంలోని గ్రామీణ నీటి సరఫరా విభాగం కార్యాలయంలో గ్రామాలకు చెందిన నీటి పరీక్షల కేంద్రంలో సేవలు ఆగిపోయాయి. నెల రోజులుగా ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయంలోకి వరద నీరు చేరటంతో నీటి పరీక్షలు ఆగిపోయాయి. అత్యవసర సమయాల్లో ల్యాబ్ నిర్వాహకులు కళ్యాణదుర్గంలో పరీక్షలు చేస్తున్నట్లుగా తెలిసింది. రాయదుర్గం నియోజకవర్గంలోని ఐదు మండలాల గ్రామాలతో పాటు ఉరవకొండ నియోజకవర్గానికి చెందిన విడపనకల్, బెళుగుప్ప, ఉరవకొండ మండలాల్లోని గ్రామాల్లో కూడా ప్రజలు తాగేనీటిని పరీక్షించాల్సి ఉంటుంది. ఈ పరీక్షా కేంద్రానికి రోజుకు పది చొప్పున నెలకు 300లకు పైగా నీటి శాంపిల్స్ను పరీక్షించాల్సి వస్తోంది.

ఉప ముఖ్యమంత్రికి ఫిర్యాదు..

రాయదుర్గంలోని ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయంలో వర్షం వచ్చినప్పుడల్లా వరద నీరు చేరటంతో ఉద్యోగులు విధులు నిర్వహించడం కష్టంగా మారింది. భవన గదులు శిథిలావస్థకు చేరడంతో భయాందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలో నూతన భవన నిర్మాణానికి నిధుల మంజూరుకు ఉపముఖ్యమంత్రి పవన్కల్యాణ్కు సమస్యను వీడియో ద్వారా ఫిర్యాదు చేయనున్నారు.



వరదనీటి నిల్వతో వృథాగా మారిన పరీక్షల కిట్లు

కెమికల్ పరీక్షల్లో ఫ్లోరైడ్ శాతం, టీడీఎస్, ఆల్కొనిటీ, క్యాల్షియం, సల్ఫేట్, క్లోరైడ్, నైట్రేట్, ఐరన్ పరీక్షలు నిర్వహించాలి. ప్రస్తుతం ఈ పరీక్షలు ఆగిపోయాయి. వరదనీరు చేరడంతో పరీక్షలు నిలిచిపోవడంతో గ్రామాల్లో రోగాల సమస్యలు తలెత్తే అవకాశముంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గదిని శుభ్రం చేయించి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

కొండమీద రాయుడి ఆలయ కానుకల లెక్కింపు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: కొండమీద రాయుడి ఆలయ హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ.1.9 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో రమేష్‌బాబు తెలిపారు. దేవరకొండపై వెలసిన కొండమీద వేంకట రమణస్వామి ఆలయంలో దేవాదాయశాఖ అధికారులు, ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో ఆరు నెలలుగా భక్తులు కానుకల రుపంలో వేసిన కానుకలు లెక్కించారు. ఈకార్యక్రమంలో ధర్మకర్త నారాయణస్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


కానుకలు లెక్కిస్తున్న అధికారులు, ధర్మకర్తలు


అధికారులను నిలదీస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అర్హులకు పట్టాలివ్వండి

నార్పల, న్యూస్‌టుడే : నార్పలలో ఇందిరమ్మ, జగనన్న కాలనీల్లో అనర్హులకు ఇచ్చిన పట్టాలను రద్దుచేసి, అర్హులకు పట్టాలివ్వాలని ప్రజా సంఘాల నాయకులు మండల సర్వసభ్య సమావేశంలో అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం ఎంపీపీ నాగేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యురాలు నాగరత్నమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అవినీతి అక్రమాలపై సీపీఐ నాయకుల గంగాధర్, రామాంజినేయులు తహసీల్దారు అరుణకుమారిని ప్రశ్నించారు. ఆమె మాట్లాడుతూ ఇళ్ల పట్టాల విషయంపై విచారణ చేసి అర్హులకు న్యాయం చేస్తామన్నారు. ఎంపీపీ నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిదీపాల సమస్యలు పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని కోరారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


దస్త్రాలు పరిశీలిస్తున్న డీఐజీ విజయలక్ష్మి

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

యాడికి, న్యూస్‌టుడే : యాడికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గురువారం స్టాంప్, రిజిస్ట్రేషన్ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ విజయలక్ష్మి తనిఖీ చేశారు. కార్యాలయంలోని దస్త్రాలతో పాటు, సిబ్బంది హాజరును పరిశీలించారు. రోజూ నమోదయ్యే దస్తావేజుల ప్రక్రియపై ఆరా తీశారు. ఈ-స్టాంపు కేంద్రాలు ఎన్ని ఉన్నాయి, వాటి నిర్వహణ తీరును సబ్ రిజిస్ట్రార్ జాఫర్‌సాదిక్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న దస్తావేజులేఖరులపై పని తీరుపై నిఘా ఉంచాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించారు.

వసతిగృహం తనిఖీ

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని పాతకొత్తచెరువు గ్రామంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని గుంతకల్లు ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయమూర్తి మంజుల గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థులకు అమలవుతున్న మెనూ అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజన సరఫరాను పరిశీలించారు. వార్డెన్ ఖాదర్ బాషా, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


భోజనం పరిశీలిస్తున్న న్యాయమూర్తి మంజుల

నారీమణులు.. ప్రగతి దివ్వెలు

● స్వయం ఉపాధి బాటలో రాణింపు
● కుటుంబాలకు ఆసరా

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని కాలువగడ్డకు చెందిన శ్రీ మంజునాథ స్వయం సహాయ సంఘం సభ్యులు స్వయం ఉపాధి దిశగా రాణిస్తున్నారు. 2008 సంవత్సరంలో సంఘాన్ని ప్రారంభించారు. అప్పట్లో ఒక్కొక్క సభ్యురాలు రూ.5 వేల నుంచి రుణసాయం అందుకున్నారు. ఇప్పుడు ఏకంగా రూ.1.50 లక్షల వరకు రుణం తీసుకుంటున్నారు. ఒక పక్క పొదుపు, మరో పక్క వ్యాపారం చేస్తూ దినదినాభివృద్ధి చెందుతున్నారు. తద్వారా పిల్లల్ని బాగా చదివిస్తూ జీవితాలను సాఫీగా సాగిస్తున్నారు.


సమావేశమైన స్వయం సహాయ సంఘం సభ్యులు

ఆర్థిక సొంతత్వం: సంఘంలో మొత్తం పది మంది సభ్యులుండగా వంటచెరుకు, కోడి గుడ్ల విక్రయ కేంద్రం, చీరల దుకాణం, జనరల్ స్టోర్ వంటి వ్యాపారాలతో స్థిరపడ్డారు. మరికొందరు అల్పాహార, కుట్టుమిషన్ కేంద్రాలు ఏర్పాటు చేసుకుని నెలకు చెప్పుకోదగ్గ ఆదాయాన్ని గడిస్తున్నారు. తమ సంపాదనతో కుటుంబ పోషణకు ఇబ్బంది లేకుండా చూస్తున్నారు. భర్త ఆర్థిక వ్యవహారాల్లో చేదోడు వాదోడుగా ఉంటున్నారు.

కలిసి నిర్ణయాలు తీసుకుంటాం

- పుల్లమ్మ, సంఘం అధ్యక్షురాలు



16 ఏళ్ల నుంచి సంఘాన్ని కలిసికట్టుగా నడుపుతున్నాం. ప్రతి నెలా సమావేశం ఏర్పాటు చేసుకుని ఎలాంటి వ్యాపారం పెట్టుకోవాలనే విషయాల గురించి చర్చించుకుంటాం. రుణానికి సంబంధించి నెలవారి కంతులో తప్పనిసరిగా చెల్లిస్తున్నాం. నా భర్త 20 ఏళ్ల కిందట చనిపోయారు. అప్పట్లో స్వయం సహాయక సంఘంలో చేరి రుణం తీసుకున్నా. ప్రస్తుతం కోడిగుడ్ల విక్రయ కేంద్రాన్ని నడిపిస్తున్నా. ఇద్దరు కుమార్తెలను ఉన్నతంగా చదివించి వివాహాలు చేశా. సంఘంలోని సభ్యులందరూ తమ పిల్లల్ని కూడా ఉన్నత చదువులు చదివిస్తున్నారు.

పురపాలిక: **తాడిపత్రి** | సంఘం ఏర్పాటు : **2008** | స్వయం సహాయక సంఘాలు: **1611** | సభ్యుల సంఖ్య : **15,987**

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య: గుంతకల్లులోని ఆలూరు రోడ్డు నుంచి చర్చికి వెళ్లే దారిలో గుంత ఏర్పడింది. **- హనుమంతు**

సమస్య: గుంతకల్లులోని రాజేంద్రనగర్‌లో రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లేదారిలో 20 మీటర్ల వరకు రోడ్డుపై పైపూత లేచిపోయింది. **- ప్రదీప్**

సమాధానం: గుంతలను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం.

- హరికృష్ణ, ఏఈ, గుంతకల్లు పురపాలక సంఘం

సమస్య: తాడిపత్రిలోని చేనేత కాలనీలో వీధి ట్యాంకు నిరుపయోగంగా మారింది. **- రమేష్‌బాబు, స్థానికుడు**

సమాధానం: వెంటనే కాలనీలో పరిశీలించి ట్యాంకుకు నీరందించేందుకు చర్యలు తీసుకుంటాం. **- తేజ, మున్సిపల్ ఏఈ**

– న్యూస్‌టుడే,గుంతకల్లు పట్టణం,తాడిపత్రి

పెద్దారెడ్డిపై కఠిన చర్యలొద్దు: హైకోర్టు

ఈనాడు, అమరావతి: వైకాపా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆయన కుమారులు హర్షవర్ధన్‌రెడ్డి, సాయి ప్రతాప్‌రెడ్డి, మరికొందరు పిటిషనర్లపై నమోదు చేసిన కేసులో కఠిన చర్యలు తీసుకోవద్దని తాడిపత్రి పోలీసులను హైకోర్టు ఆదేశించింది. కేసు దర్యాప్తునకు సహకరించాలని పిటిషనర్లకు స్పష్టం చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను నవంబర్ 11కు వాయిదా వేసింది. న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ గురువారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆయన, ఆయన కుమారులు, పలువురు వైకాపా నేతలు మారణాయుధాలతో దాడి చేసి గాయపరిచారంటూ చిన్న సంజన్న, కె.రవీంద్రరెడ్డి, షేక్ సాదక్‌వలీ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ కోసం పిటిషనర్లు కోర్టును ఆశ్రయించారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

యల్లనూరు (పుట్లూరు), న్యూస్‌టుడే : యల్లనూరు మండలంలోని పలు గ్రామాల్లో మట్కా నిర్వాహకులపై పోలీసులు దాడులు చేసినట్లు ఎస్ఐ రాంప్రసాద్ తెలిపారు. గొడ్డుమర్రి క్రాస్ పరిసరాల్లో సోదాలు చేస్తుండగా నాగేంద్రశెట్టి అనే వ్యక్తిని పట్టుకున్నట్లు చెప్పారు. నిందితుడి నుంచి రూ 30,200 స్వాధీనం చేసుకుని, మట్కా చీటీలను సేకరించినట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

విద్యార్థుల్లో ప్రతిభ అపారం

బుక్కరాయసముద్రం : ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా సమన్వయకర్త ఉదయశ్రీ తెలిపారు. గురువారం కొర్రపాడు గురుకుల పాఠశాలల విద్యార్థులకు వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. ఆర్‌ఐఓ వెంకటరమణ నాయక్ నమూనాలు పరిశీలించారు. కొర్రపాడు గురుకులం ప్రిన్సిపల్ విజయలక్ష్మి, మాధవి, శివశంకర్, దేవసేన, పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు ఏకం కావాలని ఆ పార్టీ జిల్లా బాధ్యుడు, నరసింహులు, జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గుంతకల్లులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం రాత్రి జరిగిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కాలయాపన చేస్తున్నారన్నారు. తెదేపా ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్, నాయకులు లక్ష్మీనారాయణ, మహబూబ్‌బాషా, రామాంజనేయులు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు. రైతు సంఘం రాష్ట్ర నాయకుడు తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో సంఘం కార్యాలయంలో సన్మాన కార్యక్రమం జరిగింది. పార్టీ నాయకులు రామచంద్ర, గౌస్, రామారెడ్డి, జిలాన్ తదితరులు పార్టీ జిల్లా బాధ్యుడు, అధ్యక్షుడిని సత్కరించారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా బాధ్యుడు నరసింహులు, అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

పురపాలిక అభివృద్ధే లక్ష్యం

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని వ్యాపారుల సహకారంతో పురపాలక అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద, పుట్లూరు రోడ్డులోని మున్సిపల్ స్థలాల్లో వ్యాపార సముదాయాలను నిర్మించేందుకు ప్రజల సూచనలు, సలహాల కోసం బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులకు అనుకూలంగా ఆధునిక హంగులతో కాంప్లెక్స్‌లు నిర్మిస్తామని, తద్వారా పురపాలిక రాబడి పెరగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు గుడ్‌విల్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, టౌన్‌ప్లానింగ్ అధికారి మహబూబ్‌బాషా పలువురు అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

కాలువల ఉనికిపోతే వరదలే : కాలువలు ఉనికి కోల్పోతే వరదలొచ్చి జనజీవనాన్ని అతలాకుతలం చేస్తాయని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లా కేంద్రానికి దగ్గరలోనే ఉన్న బుక్కరాయసముద్రం చెరువు వద్ద ఉన్న కాలువ కుచించుకుపోతోందని, కాలువలో వృథా మట్టి వదిలారని, అంతేకాకుండా పలుచోట్ల ఆక్రమణలకు జరిగాయన్నారు. ఎవరూ స్పందించకపోతే తానే మట్టిని తొలగించి కాలువను శుభ్రం చేయిస్తానన్నారు. ఇతర రాష్ట్రాల బస్సుల ఆంధ్రా, తెలంగాణాలోకి వెళ్తే పన్నులు వేయరని, తెలుగు రాష్ట్రాల నుంచి కేరళ, కర్ణాటక, తమిళనాడు వంటి రాష్ట్రాలకు వెళ్తే ఆ రాష్ట్ర ప్రభుత్వం పన్నులు వసూలు చేస్తోందన్నారు. ఇక్కడా ఇతర రాష్ట్రాల వారికి పన్నులు కట్టించుకోవాలన్నారు.





ఉత్సాహంగా ప్రతిభా పాటవ పోటీలు

'ఈనాడు' ఆధ్వర్యంలో గుంతకల్లులోని సర్వేపల్లి రాధాకృష్ణన్ పురపాలక ఉన్నత పాఠశాలలో గురువారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలంతో కలిగే లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక, మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన గాయత్రి, వాణిఆదిత్రీ, యశ్వంత్‌కు మార్‌లకు ప్రధానోపాధ్యాయులు రవికుమార్ బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వరరావు, విఠల్, తిమ్మారెడ్డి, లక్ష్మీనారాయణ, రామాంజినేయులు, సిబ్బంది రాము తదితరులు పాల్గొన్నారు.

-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం, గుంతకల్లు గ్రామీణ

నిర్మించారు.. వినియోగం మరిచారు

పశువులకు అవసరమైన సేవలు అందించడానికి గోపాలమిత్ర భవనాన్ని సుమారు రూ. 7.50 లక్షలతో పెనకచెర్ల గ్రామంలో నిర్మించారు. దీన్ని అప్పటి తెదేపా ప్రభుత్వంలో నిర్మించారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అది కాస్త నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ప్రారంభించాలని పాడి పోషకులు కోరుతున్నారు. దీనిపై యర్రగుంట్ల పశువైద్యాధికారి అంజినాయక్ వివరణ కోరగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.



- న్యూస్‌టుడే, గార్లదిన్నె గ్రామీణం



పోటీలు.. విజ్ఞాన వేదికలు

'ఈనాడు' ఆధ్వర్యంలో తాడిపత్రిలోని పద్మవాణి పాఠశాలలో గురువారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. అందులో భాగంగా 'అంతర్జాలంతో కలిగే లాభనష్టాలు, సామాజిక మాధ్యమాలు-విద్యార్థులపై ప్రభావం' అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన అమృత, అమరావతి, అర్జుపర్వీన్‌లకు పాఠశాల కరస్పాండెంట్ నాగపీరయ్య బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ బహబూబ్‌బాషా, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



-న్యూస్‌టుడే, తాడిపత్రి

పెన్నానదిలో ఆక్రమణలపై సర్వే

పామిడి, న్యూస్‌టుడే : కలెక్టర్ ఆదేశాల మేరకు గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు సూచనలతో పామిడి పెన్నానదిలో ఆక్రమణలను గుర్తించడంలో రెవెన్యూ సిబ్బంది నిమగ్నమయ్యారు. గురువారం తహసీల్దారు శ్రీధర్‌మూర్తి ఆధ్వర్యంలో ఆరు బృందాలుగా ఏర్పడిన రెవెన్యూ బృందం చేసిన సర్వేలో 186 ఎకరాలు ఆక్రమణలో ఉన్నట్లు గుర్తించారు.

ప్రైవేటు పాఠశాలపై విచారణ

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులోని పల్లవి పాఠశాలపై వచ్చిన ఫిర్యాదుపై ఉపవిద్యాశాఖ అధికారిణి శ్రీదేవి గురువారం విచారణ చేపట్టారు. ప్రైవేటు పాఠశాల యాజమాన్యం ఒక బుక్‌స్టాల్‌లో పుస్తకాలు తెచ్చుకోవాలని సిఫార్సు చేస్తున్నారని, కొనుగోలు చేసిన పుస్తకాలకు బిల్లులు ఇవ్వటం లేదని, గత నెలలో విద్యార్థి తండ్రి జిల్లా కేంద్రంలో స్పందన విభాగంలో ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో గుంతకల్లు ఉపవిద్యాధికారిణి శ్రీదేవి, ఎంఈవో-1 మస్తాన్‌రావు స్కూల్‌లో విచారణ చేపట్టారు. విద్యార్థి తల్లిదండ్రులు చెప్పిన విషయాలను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంఈవో తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

గార్లదిన్నె, న్యూస్‌టుడే : తెదేపా ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల్లో ప్రతి ఇంటికి ఉచిత గ్యాస్ సిలిండర్లను ఇవ్వాలని గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ ఉప తహసీల్దార్ మల్లికార్జునకు వినతి పత్రం అందజేశారు.

వేగంగా రైల్వే అభివృద్ధి పనులు

గుంతకల్లు, న్యూస్‌టుడే : ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలను కల్పించడానికి డివిజన్‌లో జోరుగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఏడీఆర్ఎం సుధాకర్ అన్నారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ గురువారం నిర్వహించిన వీడియో సమావేశానికి రైల్వే అధికారులు డీఆర్ఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏడీఆర్ఎం విలేకరులతో మాట్లాడారు. గుంతకల్లులోని ధర్మవరం రైల్వేగేటును తొలగించి అక్కడ నిర్మించాల్సిన భూగర్భ వంతెన పనులపై ప్రజాప్రతినిధులు చేసిన సూచన ప్రకారం వంతెన ఎత్తును పెంచే విషయంలో త్వరలో తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. సత్యనారాయణ పేట వద్ద రైల్వే మోరీ విస్తరణ అంశం రైల్వే పరిశీలనలో ఉందని వివరించారు. గుత్తి-పెండేకల్లు మధ్య రూ. 352 కోట్లతో రెండు వరుసలు నిర్మిస్తున్నామని, ఆ పనులు ప్రారంభమయ్యాయన్నారు. గుంతకల్లు డివిజన్‌లో 14 రైల్వే స్టేషన్లను ఆధునికీకరించే పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. గుంతకల్లులోని రైల్వే కాలనీల్లో ఉంటున్న రైల్వే కుటుంబాలు నీటి సమస్యను ఎదుర్కోకుండా చూడటానికి అదనపు సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నిర్మాణాన్ని చేపట్టనున్నామన్నారు. సీనియర్ డీఈఎన్ అభిరాం, సీనియర్ డీఓఎం శర్వాణ్, ఏసీఎం ధనుంజయ్‌కుమార్, సెక్యూరిటీ కమిషనర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఆర్ఎం సుధాకర్

ఆకట్టుకున్న సృజనాత్మక నమూనాలు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : పిల్లలు చదువుతో పాటు కొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలని కరస్పాండెంట్ కేసీ హరికుమార్, ప్రిన్సిపల్ గోపాల్ పేర్కొన్నారు. గుంతకల్లులోని శ్రీశంకరానందాగిరిస్వామి డిగ్రీ కళాశాలలో గురువారం ప్రజ్వలన్ సృజన్ ఫేస్ట్ 2024 పేరుతో విద్యార్థులు తయారు చేసిన సృజనాత్మకత నమూనాల ప్రదర్శన ఘనంగా జరిగింది.

తెదేపా శ్రేణుల సంబరాలు

గుంతకల్లు, న్యూస్‌టుడే : తెదేపా విజయానికి బీసీ విభాగం రాష్ట్ర అధికారప్రతినిధి పవన్‌గౌడ్ ఎంతో కృషి చేశారని ఆపార్టీ నాయకులు అన్నారు. పవన్‌గౌడ్ పుట్టినరోజు వేడుకలను తెదేపా నాయకులు, కార్యకర్తలు గురువారం పట్టణంలోని గాంధీ కూడలిలో ఘనంగా నిర్వహించారు. కేకు కోసి సంబరాలు చేశారు. తెదేపా కౌన్సిలర్లు షరీఫ్, ఆంజనేయులు, నాయకులు కేశప్ప, రామాంజినేయులు, శీనా, చంద్ర, నరేశ్, లక్ష్మి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

గార్లదిన్నె, న్యూస్‌టుడే: హత్యాయత్నం, పోక్సో కేసుల్లో నిందితుడిగా మర్తాడుకు చెందిన గౌస్‌పీరాను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు గురువారం తెలిపారు. 16న మైనర్ బాలికను వేధించిన కేసు, ఓ వ్యక్తిపై కొడవలితో దాడి చేయడంతో బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

తాడిపత్రి, న్యూస్‌టుడే: సజ్జలదిన్నె గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గురువారం ఇరువురికి గాయాలయ్యాయి. గ్రామీణ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు సజ్జలదిన్నెకు చెందిన ఓబుళకొండారెడ్డి, లక్ష్మయ్యలు తాడిపత్రికి సొంత పని మీద వచ్చి తిరిగి బయలుదేరారు. సజ్జలదిన్నె వద్ద రోడ్డు దాటుతుండగా బుగ్గవైపు నుంచి అతివేగంతో వచ్చిన కారు ఢీకొంది. ఈ ఘటనలో ఓబుల కొండారెడ్డికి తీవ్రగాయాలవ్వగా, లక్ష్మయ్యకు స్వల్పగాయాలైనట్లు తెలిపారు.

గాజులపల్లి అమ్మవారి ఆలయంలో చోరీ

గుత్తి, న్యూస్‌టుడే : గాజులపల్లిలో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. అమ్మవారి ఆలయం తలుపులు పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని అమ్మవారి వెండి కిరీటంతో పాటు వడ్డాణం చోరీ చేసి ఆలయం వెనుక పడేశారు. హుండీలోని రూ. 30 వేలు ఎత్తు కెళ్లారు. గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మోసాలపై ఉద్యమిద్దాం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న మోసాలను నియంత్రించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర 22వ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ గురువారం గుంతకల్లులో బీటీ ఫక్కీరప్ప భవనంలో రెండు రోజుల పాటు జరిగే సామాజిక మాధ్యమ వర్క్‌షాపును ప్రారంభించిడానికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర, కార్యదర్శి లెనిన్ బాబు హాజరయ్యారు. ముందుగా జెండాను ఆవిష్కరించి వర్క్‌షాపును ప్రారంభించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, ఆనంద్, సంతోష్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఆగుతూ.. సాగుతూ ఇళ్ల నిర్మాణాలు

● ముందుకురాని లబ్ధిదారులు
● తలలు పట్టుకుంటున్న అధికారులు

గుంతకల్లు, న్యూస్‌టుడే : ప్రస్తుత తెదేపా ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి ముందుకెళ్తోంది. గత వైకాపా ప్రభుత్వంలో ఇంటి నిర్మాణానికి నిధులు చాలవని చాలా మంది లబ్ధిదారులు నిర్మాణాలకు ముందుకు రాలేదు. ఆ లబ్ధిదారులను చైతన్య పరచి ఇంటి నిర్మాణం చేపట్టేలా అధికారులు కార్యాచరణకు పూనుకొన్నారు. మార్చి నెలాఖరులోగా ఇళ్లను పూర్తిచేసుకునే విధంగా చూడాలని ఉన్నతాధికారులు సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు.

కొన్నింటిని రద్దు చేయాలని నిర్ణయం

నియోజకవర్గంలో జగనన్న ఇళ్ల నిర్మాణ పథకం కింద ఇళ్లను నిర్మించడానికి కేటాయించిన ఇళ్ల స్థలాల్లో దాదాపు 2 వేల మంది ఏమాత్రం శ్రద్ధ చూపకపోవడంతో వారివి రద్దు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇక 14,032 మందికి కేటాయించిన స్థలాల్లో ఇప్పటి వరకు అధికారులు 5,497 ఇళ్లను మాత్రమే పూర్తి చేయించారు. ఇంకా 8,535 వరకు నిర్మాణాలు పునాదులు, మరికొన్ని గోడలకు పరిమితమయ్యాయి. ప్రస్తుతం ఇంజినీర్లు లబ్ధిదారులు ఎక్కడెక్కడ నివాసముంటున్నారో వారి చిరునామాలు తెలుసుకుని అవగాహన కల్పిస్తున్నారు. కేటాయించిన ఇళ్లను పూర్తిచేయకుంటే కొత్త వారికి ఇళ్ల మంజూరు కష్టమవుతుందని అధికారులు అంటున్నారు.

క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి

గుంతకల్లు నియోజకవర్గంలో గతంలో జగనన్న ఇళ్ల నిర్మాణ కార్యక్రమం మందకొడిగా సాగింది. ఇప్పుడా నిర్మాణాలను పూర్తి చేసుకుంటే వారం రోజుల్లోగా బిల్లులను చెల్లిస్తామని అధికారులు చెబుతున్నారు. అయినా చాలా మంది పట్టించుకోవడంలేదు. నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాలు ఇలా ఉన్నాయి.

మండలం	విధ దశల్లో ఉన్న ఇళ్ల సంఖ్య	పూర్తయిన ఇళ్ల సంఖ్య
గుంతకల్లు మున్సిపాలిటీ	2638	3144
గుత్తి మున్సిపాలిటీ	1818	1360
గుంతకల్లు గ్రామీణం	277	70
గుత్తి గ్రామీణం	335	95
పామిడి మండలం	3447	828


దోనిముక్కల కాలనీలో పునాదులకే పరిమితమైన పనులు

అవగాహన కల్పిస్తున్నాం

- వెంకటేశ్వర్లు, డీఈ, గృహ నిర్మాణ సంస్థ

నియోజకవర్గంలో జగనన్న ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో లబ్ధిదారులు కొందరు ఇళ్లను నిర్మించుకునే విషయంలో ఉత్సాహం చూపని విషయం వాస్తవమే. మేము వారిని కలిసి పనులను వచ్చే మార్చిలోగా పూర్తిచేసుకోవాలని కోరుతున్నాం. బిల్లులు వారంరోజుల్లో చెల్లిస్తామని చెబుతున్నాం. ప్రభుత్వం ఇళ్లను పూర్తిచేసే విషయంలో చిత్తశుద్ధితో ఉంది.

ట్రాఫిక్ పద్మవ్యూహం

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ చిక్కులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు సిబ్బంది ఏర్పాటు చేయకపోవడంతో జనం ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతున్నారు. యల్లనూరు రోడ్డు సర్కిల్, పుట్లూరు రోడ్డు సర్కిల్, బస్టాండ్ కడళ్లల్లో సమస్య తీవ్రంగా ఉంది. యువత శిరస్త్రాణం లేకుండా, చరవాణుల్లో మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. నియంత్రించే సిబ్బంది లేకపోవడంతో నాలుగువైపుల నుంచి ఒకేసారి వాహనాలు కూడళ్లలోకి రావడంతో గంటల కొద్దీ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందోని, అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయంపై తాడిపత్రి పట్టణ సీఐ సాయిప్రసాద్‌తో ప్రస్తావించగా పోలీసు సిబ్బంది కొరత ఉంది. ట్రాఫిక్ సమస్య ఉన్న కూడళ్లను పరిశీలించి వాహనదారులకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.


యల్లనూరు రోడ్డు కూడలిలో అడ్డదిడ్డంగా వాహనాలు



కమిషనరు నాగరాజుకు విన్నవిస్తున్న నేతలు

నగరపాలక స్థలాలను కాపాడాలి

అనంత నగరపాలక: అనంతపురం నగరంలో నగరపాలక స్థలాలను కబ్జా కోరుల బారి నుంచి కాపాడాలని సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, సహాయ కార్యదర్శి రమణలు కమిషనరుకు విన్నవించారు. సెంట్రల్ పార్కు, స్థలం, బాజానగర్, శ్రీనివాసనగర్, శ్రీనగర్ కాలనీలో నగరపాలక స్థలాలను ఆక్రమించారన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు దారుణంగా ఉన్నాయని మరమ్మతులు చేయాలని కోరారు.

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

పండమేరు ఆక్రమణలపై ఎమ్మెల్యే సునీత ఆరా

రాప్తాడు, న్యూస్‌టుడే: పండమేరు వంక, నడిమివంకల్లో పట్టాలు లేకుండా ఇళ్లు నిర్మించుకున్నవారి పరిస్థితి ఏంటని, వారికి సహాయం చేయడానికి ఇతర మార్గాలున్నాయా? పండమేరు వంక సరిహద్దును గుర్తించే అవకాశం ఉందా అని ఎమ్మెల్యే పరిటాల సునీత అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్లలో లబ్ధిదారులకు ఎంత స్థలం కేటాయించారు వంటి అంశాల గురించి అధికారులతో చర్చించారు. భారీ వర్షాలు వచ్చిన ప్రతిసారి వీరు నష్టపోతున్నారని, వీరికి శాశ్వత పరిష్కారం చూపే విధంగా హౌసింగ్, రెవెన్యూ అధికారులు చొరవ చూపాలన్నారు. ముంపు ప్రాంతాల్లో ఎవరు పట్టాలిచ్చారు, ఇక్కడ స్థలాలు విక్రయాలు చేసిందెవరు అన్న అంశాలపై విచారణ చేయాలన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలి

అనంతనగరపాలక: అభివృద్ధి పనులు పలు చోట్ల ఆగాయని ఇంజినీరింగ్ అధికారుల చొరవ చూపి వేగం పెంచాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. ఇంజినీర్ల బదిలీలు వంటి పలు కారణాలతో నగరంలో పనులు ఆగిపోయాయని, ప్రస్తుతం ఇంజినీరింగ్ విభాగంలో అన్ని హోదాల్లో ఉద్యోగులు కొత్తవారు చేరడంతో ఇక అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. డివిజన్ల వారీగా పని విభజన చేసుకోవాలన్నారు.

జర్నలిస్టు కాలనీ వివాదంపై విచారణ చేయండి

రాప్తాడు: కొడిమి జర్నలిస్టు కాలనీకి సంబంధించిన వివాదంపై విచారణ చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులకు తెలిపారు. జర్నలిస్టు కాలనీలో ఎంత మంది లబ్ధిదారు, ఎంతమంది నివాసమున్నారు, ఇందులో నిర్మించుకుంటున్నవారు ఎంతమంది వంటి వివరాలు ఇవ్వాలని సునీత అధికారులకు సూచించారు. రెవెన్యూ అధికారుల ప్రమేయం లేకుండా ఇష్టపట్టాలు ఇస్తామని ఇతరుల ప్రకటించడం ఏంటని, అలాగే ఇళ్ల నిర్మాణాలు జరగడమేంటని ప్రశ్నించారు.

27న టీసీసీ పరీక్షలు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు పరీక్షల విభాగం సహాయ కమిషనర్ గోవింద నాయక్ తెలిపారు. రాజేంద్రనగర పాలకోన్నత పాఠశాలలో ఈ పరీక్షలు 3 విడతలుగా జరుగుతాయన్నారు. అభ్యర్థులు వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు తీసుకోవచ్చని విజ్ఞప్తి చేశారు.

ఆక్రమణలే ముంచాయి!

• ఎక్కడికక్కడ కబ్జాకు గురైన పండమేరు వంక

ఈనాడు, అనంతపురం



పండమేరు వంక మధ్యలో నిర్మించిన ఇల్లు

పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల అవినీతి పండమేరుకు శాపంగా మారాయి. పండమేరు వంకను వరదలు ముంచెత్తడానికి భారీ వర్షాలు ఒక కారణమైతే.. ఆక్రమణలు మరో ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. అడిగేవారు.. అడ్డుకునేవారు లేకపోవడంతో వంకను రెండువైపులా నుంచి ఆక్రమించేశారు. నకిలీ పట్టాలు, పత్రాలు సృష్టించి వంక పోరంబోకు భూమిని కబ్జా చేసి కబంధ హస్తాల్లోకి తీసుకున్నారు. ఉప్పరపల్లి పరిధిలో ఏకంగా వంకను కొంతమేర పూడ్చి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. రాజకీయ కారణాలతో పాలకులు ఆక్రమణలను ప్రోత్సహిస్తూ వచ్చారు. అడ్డుకోవాల్సిన అధికారులు అవినీతికి అలవాటుపడటంతో ఐదారేళ్లలోనే పండమేరు వంక పూర్తిగా కుంచించుకుపోయింది. ఫలితంగా వంక ప్రవాహ సామర్థ్యం సగానికి పైగా తగ్గిపోయి రెండు వైపులా ఉన్న కాలనీలను వరద ముంచెత్తింది. ప్రకృతి ప్రకోపానికి.. పాలకులు, అధికారుల పాపం తోడై సామాన్యులు కట్టుబట్టలతో మిగిలిపోతున్నారు.

ఆ ప్రాంతాల్లోనే ముంపు

పండమేరు వంక రామగిరి మండలం పేరూరు వద్ద మొదలై.. కనగానపల్లి, రాప్తాడు మండలాల మీదుగా అనంతపురం నగర శివారులోకి ప్రవేశిస్తుంది. మైనార్టీ కాలనీ, కళాకారుల కాలనీ మీదుగా ఉప్పరపల్లి పరిధిలో ప్రవహిస్తూ అనంత సాగరంలో కలుస్తుంది. 40 కిలోమీటర్లు మేర ప్రవహిస్తుంది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి రామగిరి, కనగానపల్లి మండలాల్లో చెరువులు పొంగి పండమేరులోకి వరద వచ్చింది. కనగానపల్లి చెరువు తెగిపోవడంతో ఉద్ధృతి మరింత పెరిగింది. అయినా కనగానపల్లి, రాప్తాడు మండలాల్లో ఎక్కడా వంకను దాటి ప్రవాహం వెళ్లలేదు. అనంతపురం నగర శివారులో ఆక్రమణల కారణంగా వంక వెడల్పు తగ్గిపోయి ఆనుకుని కాలనీల్లోకి ప్రవహించింది. ఆర్డీటీ స్టేడియం ఎదురుగా వంతెన దాటిన తర్వాత ఆక్రమణలు ఎక్కువగా ఉండటంతో ఇందిరమ్మకాలనీతోపాటు నగర పరిధిలోని రామకృష్ణనగర్‌లోకి వరద ప్రవాహం కొనసాగింది. వనమిత్ర పార్కు వెనుక భాగంలో 10 ఎకరాల వరకు వంక పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి ఇటుక బట్టీలు, ఇళ్లు, గుడిసెలు నిర్మించుకున్నారు. వంక పూడ్చి నిర్మాణాలు చేపట్టడంతో పండమేరు ప్రవాహ దిశ కూడా మారినట్లు నిపుణులు చెబుతున్నారు.

ఇళ్లపట్టాల పేరుతో కబ్జాపర్వం

కళాకారుల కాలనీలో గతంలో కొంతమందికి పట్టాలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేశారు. కొందరు స్థానిక నాయకులు వంకకు ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాలకు నకిలీ పట్టాలు పుట్టించి పేదలకు అమ్మేశారు. తక్కువ ధరకు వస్తున్నాయనే కారణంతో రాజకీయ నాయకుల నుంచి ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున ఆయా ఇళ్లను వరద ముంచెత్తింది. అయినా ఇప్పటికీ కబ్జాపర్వం కొనసాగుతోంది.

• ఉప్పరపల్లి పంచాయతీ పరిధిలోన వంకకు ఆనుకుని జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. 400 మందికి పట్టాలు మంజూరు చేయడంతో వారంతా ఇళ్లు నిర్మించుకున్నారు. జగనన్న కాలనీకి ఆనుకుని ఉన్న వంకను ఆక్రమించి స్థానిక వైకాపా నాయకుడు ఇళ్ల స్థలాలుగా మార్చి పేదలు, అమాయకులకు విక్రయించేశారు. ఫలితంగా వంక మరింత కుంచించుకుపోయింది. ఆక్రమణల కారణంగా వంక పరిధి తగ్గిపోయి వరద నీరు ఆటోనగర్, రామకృష్ణ కాలనీ, సుశీల్‌రెడ్డి కాలనీ, నారా లోకేశ్ కాలనీ, అభ్యుదయ కాలనీల్లోని సుమారు 560 ఇళ్లు ముంపులోకి వెళ్లిపోయాయి.



ఉప్పరపల్లి జగనన్న కాలనీ సమీపంలో వంక పోరంబోకును ఆక్రమించి నిర్మాణాలు


నిర్వహణలేమితోనూ నష్టం

పండమేరులో ఐదేళ్లుగా నిర్వహణ పనులు చేపట్టలేదు. ఫలితంగా అడవిని తలపించేలా కంపచెట్లు పెరిగాయి. ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న వంతెన వద్ద ఏపుగా పెరిగిన కంపచెట్లు వరద ప్రవాహాన్ని వెనక్కి నెట్టేయడంతో కళాకారుల కాలనీలో ముంపు తీవ్రత పెరిగింది. ఉప్పరపల్లి పరిధిలోనూ వంక మధ్యలో కంపచెట్లు గుంపులుగా పెరిగాయి. వరదల్లో కొట్టుకు వచ్చిన చెత్త కంపచెట్లకు తగులుకుని ప్రవాహాన్ని నిలువరించడంతో వాటి పైభాగంలోని కాలనీలను వరద ముంచెత్తింది.

సమస్యలతో సతమతమవుతున్నారా!

అనంత నగరపాలికలో తాగునీరు సరిగా సరఫరా కావడం లేదా? వీధి దీపాలు వెలగడం లేదా? కాలువలు శుభ్రం చేయడం లేదా? వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోతుందా. తాగునీటి పైపులైన్ లీకవుతుందా? కుక్కలు, బెడద అధికంగా ఉందా? శివారు కాలనీల సమస్యలు పట్టించుకోవడం లేదా? ఇలాంటి సమస్యలతో సతమతమవుతున్నారా? వీటి పరిష్కారానికి 'ఈనాడు - మేమున్నాం.. మీకు తోడుగా' వేదికగా కమిషనర్‌తో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. మీరు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలు తెలుపండి. పరిష్కారమయ్యేలా చూస్తాం. ఇంకెందుకు ఆలస్యం. ఫోన్ చేసి సమస్య వివరించండి.

తేది: 26.10.2024 (శనివారం)
సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల వరకు
98499 07393
80085 73011



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు చెక్కు అందజేసిన పెన్షనర్ల పార్టీ రాష్ట్ర నాయకులు

సీఎం సహాయ నిధికి రూ.1.50 లక్ష విరాళం

రుద్రంపేట: ముఖ్యమంత్రి సహాయ నిధికి పెన్షనర్ల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బరాయన్ ఆధ్వర్యంలో అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి రూ.1.50 లక్షల రూపాయలు చెక్కు అందజేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ పింఛన్ దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న గౌడ్ తెలిపారు. ప్రభుత్వ పింఛన్ దారులు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు, రావాల్సిన డీఏ బకాయిలు విడతల వారీగా ఇవ్వాలని, ఈ దీపావళికి డీఏలు ప్రకటించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)
అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005, రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

సమస్య: కోవూరునగర్ 4వక్రాస్‌లో చెట్టు కొమ్మలు తొలగించి తీసుకెళ్లకుండా అలాగే ఉంచారు. **- సత్యమానందస్వామి**
సమాధానం: వెంటనే చెట్టు కొమ్మలు తొలగిస్తాం.
సమస్య: ఆదిమూర్తినగర్ వేమన టెలిఫోన్ భవన్ పక్కన రోడ్డులోనే 10రోజులుగా చెత్త తొలగించకుండా అలాగే ఉంచారు. **-నారాయణప్ప**
సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్తను తొలగిస్తాం.
(పై ప్రశ్నలకు నగరపాలక ప్రజారోగ్య అధికారి విష్ణుమూర్తి సమాధానాలు ఇచ్చారు) – న్యూస్‌టుడే, అశోక్‌నగర్

పేరుకుపోయిన చెత్త తొలగించారు

రుద్రంపేట, న్యూస్‌టుడే: రుద్రంపేట పంచాయతీ పరిధి ప్రధాన కూడలిలో డ్రైనేజీ కాలువ స్తంభించడంతో మురుగు రోడ్డుపైకి చేరింది. వాహన రాకపోకలకు అంతరాయంగా మారిందని గురువారం ఈనాడులో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించారు.




వ్యాసరచన పోటీలతో సృజన వికాసం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: వ్యాసరచన పోటీలు విద్యార్థుల్లో విభిన్న ఆలోచనలు కలిగిస్తాయని గుడ్ చిల్డ్రన్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల ప్రధానాచార్యులు పవన్‌కుమార్ పేర్కొన్నారు. ఈనాడు ఆధ్వర్యంలో గురువారం మారుతి నగర్‌లోని గుడ్‌చిల్డ్రన్ ఆంగ్లమాధ్యమ పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగంలో లాభాలు, నష్టాలు', 'విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశాలపై వ్యాసరచన పోటీలు జరిగాయి. 10వ తరగతి విద్యార్థిని జ్యోత్స్న, 9వ తరగతి విద్యార్థిని ధరణి, 8వ తరగతి విద్యార్థిని సాత్విక వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు దక్కించుకున్నారు. ప్రధానాచార్యులు పవన్‌కుమార్ విజేతలకు బహుమతులు అందజేశారు.

దివ్యాంగ జంటకు ఎంపీ, మేయర్ ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: తెలంగాణ అమ్మాయి, అనంత అబ్బాయి మనసులు కలిశాయి. వేద మంత్రాల మధ్య జంట ఒక్కటయ్యారు. ఇద్దరూ దివ్యాంగులే. గురువారం చిన్మయ జగదీశ్వరాలయంలో సంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకున్నారు. అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ మండలం మురడి గ్రామానికి చెందిన లోకేశ్, తెలంగాణ కొమరం భీం జిల్లా సిర్పూర్ మండలం అచ్చల్ల గ్రామానికి చెందిన రాథోడ్ సునీతలకు వికలాంగ సంక్షేమ సంఘం సహకారంతో సాయి ట్రస్టు ఆధ్వర్యంలో వివాహం జరిపించారు. ముఖ్య అతిథిగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మేయర్ వసీం, ఉపమేయర్ వాసంతి సాహిత్య, సాయి సంస్థ వ్యవస్థాపకులు విజయసాయిలు నూతన జంటను ఆశీర్వదించారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం క్రీడలు, ఆత్మకూరు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడల హాకీ పోటీల్లో పాల్గొనే జిల్లా అండర్-14, 17 విభాగాల బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. అనంత క్రీడాగ్రామంలో ఎంపిక పోటీలు నిర్వహించి అందులో సత్తాచాటిన వారిని తుది జట్లకు ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి వివిధ ప్రాంతాల నుంచి 200 మందికి పైగా బాలబాలికలు ఈ పోటీలకు హాజరయ్యారు. ప్రతిభ ఆధారంగా జట్లను ప్రకటించారు. పాఠశాల క్రీడల జిల్లా సమాఖ్య కార్యదర్శి సుగుణబాయి జట్లను ప్రకటించారు.

ఎంపికైన క్రీడాకారుల వివరాలు

అండర్-17 బాలబాలికల జట్లు: బాలికల విభాగంలో టి.హర్షిత, ఎస్.మీరంబీ, టి.భావన, టి.తేజస్వి, ఎం.ప్రేమలత, కె.భవానీ, ఎస్.నందిని, ఎం.సంధ్య, షర్మిల, బి.ప్రియాంక, డి.జుబేదాభాను, టోనీప్రియా, శశికళ, బి.యామినికృష్ణ, కె.లాస్యరెడ్డి, జి.సాయిభవిత, టి.స్వాతిలు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో గోవర్ధన్, నందు, సాదిక్, రామ్‌చరణ్‌తేజ, అభిషేక్, చేతన్, లవన్‌కుమార్, మధు, కుమారస్వామి, ఉదయ్, మనోజ్, పృథ్వీ, శబరీష్, రవితేజ, వెంకట్, అభిషేక్, రాజేష్, జశ్వంత్, హర్షలు ఎంపికయ్యారు.

అండర్-14 బాలబాలికల జట్లు: సాయిభవ్య, ఎం.మైథిలీ, దుర్గా, మానియా, సాయికీర్తన, పి.తేజస్వి, ఎస్.జయశ్రీ, ఆర్.ప్రియాంక, కె.మానస, టి.హేమ, ఎ.కమలాక్షి, జి.అమృత, ఈ.దీక్షిత, కె.హర్షవర్ధిని, బి.చందన, రోనిక, మల్లికాలు బాలికల విభాగంలో ఎంపికయ్యారు. బాలుర విభాగంలో మహమ్మద్ అవేజ్, మేఘనాథ్, యశ్వంత్, బాలరాజు, గణేష్, పోతులయ్య, సికిందర్, సుధీర్, అఫ్జల్‌ఖాన్, విక్రాంత్, విక్కీ, అఖిల్, సాత్విక్, విజయ్, ఆంజనేయులు, నాగ, ప్రదీప్, శశికుమార్‌లు ఎంపికయ్యారు.



అండర్-14 బాలికల హాకీ జట్టు

రాప్తాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

రాప్తాడు: రాప్తాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్-19 త్రోబాల్ విభాగంలో నవ్యశ్రీ, కీర్తన, భవిత, హేమలత, దుర్గారేవంత్, అండర్-19 ఖోఖోలో తనూజ, అండర్-17 హ్యాండ్‌బాల్‌లో లోకరాజు, అండర్-14 హ్యాండ్‌బాల్‌లో చాణక్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీలు రాజశేఖర్‌రెడ్డి, కేశవమూర్తి తెలిపారు.

అనారోగ్యంతో హెడ్‌కానిస్టేబుల్ మృతి



నరసింహమూర్తి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా పుట్లూరు పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ నరసింహమూర్తి (50) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి స్వగ్రామమైన కంబదూరు మండల కేంద్రంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. కొంతకాలంగా అతడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతదేహాన్ని కంబదూరుకు తరలించి, అక్కడి నుంచి శ్మశాన వాటికలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేశారు. ఎస్పీ జగదీశ్.. నరసింహమూర్తి మృతిపట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే చొరవతో విద్యుత్తు కాంతులు



రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: రాప్తాడు నియోజకవర్గం పరిధి పంగల్ రోడ్డు నుంచి ఎస్కేయూ మీదుగా ఇటుకలపల్లి వరకు, అనంతపురం నుంచి బెంగళూరు జాతీయ రహదారిలో రెండేళ్లుగా హైమాస్ట్ లైట్లు వెలగలేదు. రాత్రిళ్లు చీకట్లో అనేక ప్రమాదాల బారిన పడుతున్నారని ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి పలువురు నాయకులు తీసుకెళ్లారు. జాతీయ రహదారుల గుత్తేదారులు అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. సమస్య తీవ్రతను ఎమ్మెల్యే అధికారులకు వివరించారు. లైట్లకు మరమ్మతులు చేయించారు.

అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై కేసు

అనంత నేరవార్తలు: అనంతపురం నగరం పాతూరులో ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఆకతాయిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మహిళ ఇంటి పక్కన ఉన్న ప్రతాప్‌సింగ్ కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. బాధితురాలి భర్త ఉద్యోగ నిమిత్తం ఇంటి నుంచి వెళ్లిపోగానే, సదరు ఆకతాయి మహిళకు అసభ్యకరంగా సైగలు, మాటలతో వేధించేవాడు. కొన్ని రోజులుగా భరించినా, వేధింపులు అధికం కావడంతో గురువారం పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నిరంకుశ ధోరణి తగదు

అరవిందనగర్ : తపాలా శాఖలో ఎనిమిదో వేతన కమిటీ అమలు, గ్రామీణ తపాలా ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంలో యాజమాన్యం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణయ్య యాదవ్, పీ 4 ఉద్యోగుల డివిజన్ కార్యదర్శి నాగేశ్వర్ ఆందోళన వ్యక్తం చేశారు. అనంతపురం నగరం ప్రధాన తపాలా కార్యాలయం ఆవరణలో జీడీఎస్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

ఎస్కేయూ బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

ఎస్కేయూ: ఎస్కేయూ బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక చేసినట్లు ఎస్కేయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి జెస్సీ తెలిపారు. ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు మహమ్మద్ మసూద్‌వలి, ఉదయ్‌నరసింహ, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల విద్యార్థి షాలోన్, పీవీకేకే డిగ్రీ కళాశాల విద్యార్థి పవన్, ఎస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థి గౌతం ఉన్నారు. ఈ జట్టు తమిళనాడులోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకూ జరిగే సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటుంది.

సీఎం సహాయనిధితో బాధితులకు భరోసా



చెక్కులు అందుకున్న బాధితులతో దగ్గుపాటి ప్రసాద్

రాంనగర్(అనంతపురం) న్యూస్‌టుడే: అనారోగ్యంతో ఆపరేషన్లు చేయించుకుని, ఆర్థికంగా కష్టాల్లో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అందించి ఆదుకోవడమే ముఖ్య ఉద్దేశమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. సీఎం సహాయనిధి కింద అనంతపురం అర్బన్‌లోని ఏడుగురు బాధితులకు మొత్తం రూ.11.71 లక్షలు మంజూరైందని ఎమ్మెల్యే తెలిపారు. గురువారం అర్బన్ క్యాంపు కార్యాలయంలో బాధితులకు చెక్కులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు మంచి చేసే విషయంలో రాజకీయాలు, పార్టీలు చూడమన్నారు. పార్టీలకు అతీతంగా సాయం అందిస్తున్నామని చెప్పారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ సానుకూలంగా ఉన్నారని, వారి వద్దకు ఏ సమస్య తీసుకెళ్లినా తక్షణమే స్పందిస్తున్నారన్నారు. ఈ నాలుగు నెలల్లోను ముఖ్యమంత్రి సహాయనిధి కింద అనంతపురం నగరంలో రూ.35 లక్షలు సాయం చెక్కులు అందజేశామన్నారు. బాధితుల్లో ముత్యాల రమేశ్‌కుమార్‌కు రూ.7 లక్షలు, నరసింహారెడ్డికి రూ.81 వేలు, రంగనాథకు రూ.83,752, శ్రీనివాసులుకు రూ.70,164, కృష్ణకు 62,038, మస్తానప్పకు రూ.30,786, సుష్మా ఎస్తర్ రాణికి రూ.1,43,249 చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ముఖ్యమంత్రికి బాధితులంతా కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సమస్యలు రాకుండా చూడండి

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఎక్కడా విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలని దగ్గుపాటి ప్రసాద్ ఆదేశించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో విద్యుత్, మున్సిపల్, జాతీయ రహదారి అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంతో పాటు నాలుగు పంచాయతీల పరిధిలో తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటం, కాలనీల్లో విద్యుత్ తీగలు కింద వేలాడటం వంటి ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయన్నారు. కమిషనర్ నాగరాజు, ఈఈ రమేశ్, ఏఈ సుజిత, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, టీపీవో శిరీష, విద్యుత్ అధికారులు శ్రీనివాసులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

రాప్తాడు, న్యూస్‌టుడే: ప్రసన్నాయపల్లి పంచాయతీలోని కళాకారుల కాలనీ, దండోర కాలనీల్లో వరదలతో నష్టపోయిన బాధితులకు గురువారం ధర్మవరపు మురళి నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం నుంచి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వరద బాధితులకు ఎప్పుడూ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం కళాకారుల కాలనీలో 400 మందికి భోజనం సౌకర్యం కల్పించారు.

వరద బాధితులకు సాయం

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే : పండమేరు వంక సమీపంలో వరద తీవ్రతకు గురైన కాలనీల ప్రజలకు గ్లోరియస్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు శేఖర్ బాబు అన్నదానం చేశారు. మూడు రోజులుగా వరద ప్రాంతాల్లోని ప్రజలకు అన్నదానంతో పాటు మహిళలకు చీరలు, చిన్నారులకు దుస్తులు అందజేస్తున్నట్లు తెలిపారు.

వెబ్‌సైట్‌లో రవాణాశాఖ సేవలకు అవకాశం

లక్ష్మీనగర్: రవాణాశాఖ పరిధిలో ఉన్న అన్ని సేవలను వాహన యజమానులు వాహన్ అనే వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చునని జిల్లా ఉప రవాణా శాఖ అధికారి ఎం.వీర్రాజు ప్రకటనలో తెలిపారు. త్రైమాసిక పన్ను మొత్తాన్ని కొత్తగా ఏర్పాటు చేసిన వాహన్.పరివాహన్.జీవోవి వెబ్‌సైట్‌లో మాత్రమే కట్టాలని డీటీసీ వెల్లడించారు.

ప్రైవేటు ఆసుపత్రి స్టాఫ్‌నర్సు అదృశ్యం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగరం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో స్టాఫ్‌నర్స్‌గా పనిచేస్తున్న మహిళ గురువారం అదృశ్యమైంది. బుక్కరాయసముద్రం మండలానికి చెందిన సదరు మహిళ నగరంలోని అశోక్‌నగర్‌లో ఉంటున్న తన సోదరి ఇంటికి వెళ్లింది. కాసేపటి తర్వాత అక్కడ ఎవరితో చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె సోదరి, కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఒకటో పట్టణ పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు.

పదో తరగతి విద్యార్థి..

అనంత నేరవార్తలు: నగరంలో గుల్జార్‌పేటలో ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి అదృశ్యమయ్యాడు. కనగానపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడు నగరంలోనే వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్నాడు. బుధవారం ఉదయం నుంచి కనిపించకుండా పోయాడు. గాలించినా ఫలితం లేకపోవడంతో, విద్యార్థి తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నారాయణపురంలో నీటి కష్టాలు

విద్యుత్తు మోటారు పాడైపోవడంతో సరఫరా బంద్

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: ఐదు రోజుల నుంచి కాలనీ వాసులకు చుక్క నీరు సరఫరా కాలేదు. కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయలేదు. కొళాయిలకు నీరు రాకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్తు మోటారు చెడిపోవడంతో ఈ సమస్య తలెత్తింది. నీటికోసం కాలనీ వాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అనంతపురం గ్రామీణ మండలం ఎ.నారాయణపురం పంచాయతీ పరిధి ఇందిరమ్మ కాలనీలో 300 గృహాలు ఉన్నాయి. ఇంటింటా కొళాయి సౌకర్యం ఉంది. ఒకే ఒక్క విద్యుత్తు మోటరుతోనే కాలనీకి మొత్తం నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ మోటారు మొరాయిస్తే కాలనీలో నీటి సమస్య ఉత్పన్నమవుతోంది. ఐదు రోజుల క్రితమే విద్యుత్తు మోటారు మరమ్మతుకు గురైంది. అప్పటి నుంచి చుక్కనీరు బయటకు రాలేదు. ప్రజలు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసుకుంటున్నారు. ఆర్థిక శక్తి లేని వారు సుదూరంగా వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. కొందరు క్యాన్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్లతో సరఫరా చేయలేదు. ఫలితంగా నీటి కోసం కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ విద్యుత్తు మోటారు, తీగలను మార్చి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.



నీరు రాని కొళాయి

చాలా ఇబ్బందికరం



ఐదు రోజుల నుంచి కొళాయిలకు నీరు రాలేదు. కాలనీకి నీటి సమస్య తరచూ వేధిస్తోంది. శాశ్వతంగా పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. నీరు రాకుంటే 300 కుటుంబాలు ఇబ్బంది. **- జె.లక్ష్మన్న, కాలనీవాసి**

ట్యాంకర్లు తెప్పించండి



ఇందిరమ్మ కాలనీకి ఒక విద్యుత్తు మోటారుతోనే నీటిని సరఫరా చేస్తున్నారు. ఇది కొంచెం మరమ్మతుకు గురైనపుడల్లా తాగునీటికి ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. పంచాయతీ అధికారులు కనీసం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలి. **- నగేష్, ఇందిరమ్మకాలనీ**

రుద్రంపేట శివారు.. మురుగుతో బేజారు



రుద్రంపేట, న్యూస్‌టుడే: రుద్రంపేట పంచాయతీ పరిధిలోని శివారుకాలనీలు చంద్రబాబునగర్, చైతన్య కాలనీ, పంతుల కాలనీలు మురికి కూపాలుగా మారాయి. కాలనీలకు సమీపంగా డ్రైనేజీ నీరు ప్రవహిస్తున్నందున ఇళ్ల సమీపంలో మురుగు పారుతోంది. మురుగు నీరు ఇళ్లపక్కకు చేరుతుండటంతో పందులు, దోమలు వ్యాప్తి పెరిగి చిన్న, పెద్ద తేడా లేకుండా రోగాలబారిన పడుతున్నామని స్థానికులు గోడు వెళ్లబోసుకొంటున్నారు. పాలకులు, అధికారులు స్పందించి మురుగునీరు ఇళ్ల మధ్యకు చేరకుండా రక్షణ గోడలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

అడుగు తప్పితే ప్రమాదమే

రుద్రంపేట పంచాయతీ పరిధిలోని చైతన్య కాలనీ ప్రజలు రహదారి సదుపాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీకి సమీపంగా ఉన్న కాలువలో తాత్కాలికంగా రాతి బండలు ఏర్పాటు చేసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. అడుగు తప్పితే ప్రమాదం తప్పదు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కల్వర్ట్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

